
ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -251 | పేజీలు - 12 | వెల - 03/- | బుధవారం 24 డిసెంబర్ 2025



## నేడు నింగిలోకి బ్లూబర్డ్ బ్లాక్-2

2లో.

- శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం
- అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
- శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- నేడు ఉదయం 8.54 గంటలకు నిందిలోకి ఎగరనున్న రాకెట్



## సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల...

2లో.

- కేంద్ర ప్రభుత్వంలో
- టీడీపీ నేతకు కీలక పదవి
- మూడేళ్ల పాటు ఈ పదవిలో మాజీ ఎంపీ
- నియామకాన్ని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- టీడీపీ-ఎన్డీఏ సంబంధాల్లో కీలక పరిణామంగా విశ్లేషణ




# క్వాంటం విప్లవానికి ఏపీనే నాయకత్వం

### "క్వాంటం టాక్ బై సీఎం సీబీఎన్" కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

- అమరావతిని భారత క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్న సీఎం
- వచ్చే రెండేళ్లలో ఏపీలోనే క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు ఉత్పత్తి చేస్తామని ప్రకటన
- లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయాలనేది ప్రభుత్వ ప్రణాళిక అన్న చంద్రబాబు
- విశాఖ డేటా సెంటర్ల గ్లోబల్ హబ్‌గా మారుతోందని వ్యాఖ్య
- క్వాంటం, ఏఐ, గ్రీన్ హైడ్రోజన్‌తో ఫ్యూచర్ రెడీ ఏపీ నిర్మాణమని వెల్లడి

అమరావతి,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
"క్వాంటం టాక్ బై సీఎం సీబీఎన్" కార్యక్రమంలో సీఎం చంద్రబాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేశారు. క్వాంటం టెక్నాలజీ, భారత విజ్ఞాన చరిత్ర, దేశ-రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక దిశపై సమగ్రంగా వివరిస్తూ, అమరావతిని భారత క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజెంటేషన్ ద్వారా క్వాంటం ప్రోగ్రామ్‌లోని కీలక అంశాలను వివరించిన సీఎం, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉన్నట్లే.. భారత్‌కు క్వాంటం వ్యాలీగా అమరావతిమిగతా 2లో...



# ఈ నెలాఖరు నుంచే కుటుంబ సర్వే

- ఏపి ప్రభుత్వం కీలక నిర్ణయం
- ప్రజల సమగ్ర వివరాలు సేకరణ
- ప్రభుత్వ పథకాల పారదర్శక అమలుకు నిర్ణయం



అమరావతి,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ వ్యాప్తంగా ఈనెలాఖరు నుంచి సమగ్ర కుటుంబ సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబం వివరాలు సేకరించనుంది. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహణ చేయనుంది. సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అమలు కోసం ఈ సర్వే చేయనుంది.
రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఖచ్చితంగా నమోదు చేసేలా చూడటం ఈ సర్వే లక్ష్యం. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను సకాలంలో అందించడానికి ఈ సర్వే చేస్తోంది. అలాగే ఈ సర్వే ద్వారా ప్రజాసేవల పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచనుంది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేయనున్నారు. మిగతా 2లో...

## బంగ్లాదేశ్‌లో అల్లర్లు..హిందువుల ఊచకోత

### బంగ్లా హైకమిషన్ ముందు విహెచ్‌పి ఆందోళన

న్యూఢిల్లీ,,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
బంగాలో అల్లర్లు, హిందువలుపై ఊచకోతలకు నిరసనగా విహెచ్‌పి ఆందోళనకు దిగింది. దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద మంగళవారంనాడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంగ్లాలో హిందువులపై దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దఎత్తున బంగ్లా హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా మిగతా 2లో...



## వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు

- శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
- దర్శనాల్లో సామాన్య భక్తులకే పెద్ద పీట
- తొలి మూడు రోజులు టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం
- చివరి ఏడు రోజుల్లో సర్వ దర్శనం
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
తిరుమల శ్రీవారి ఆలయంలో 30 తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి మిగతా 2లో...



# ఫోన్‌ట్యాపింగ్ కేసు కీలక మలుపు!

### - కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చే యోచనలో సిట్:

- మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐపీఎస్ అనిల్ కుమార్‌లను కూడా ప్రశ్నించే అవకాశం
- నాలుగో రోజు కొనసాగిన ప్రభాకర్‌రావు విచారణ



2లో.

# అన్నీ అబద్ధాలే

### ఆర్బీఐ డేటా చెబుతోంది: జగన్

- ఆర్బీఐ లెక్కల ప్రకారం పారిశ్రామిక వృద్ధిలో ఏపీ అగ్రస్థానంలో ఉందని వెల్లడి
- పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన అంబటి రాంబాబు
- మెడికల్ కాలేజీల స్కామ్ భయంతోనే పవన్ వ్యాఖ్యలని ఆరోపణ

అమరావతి,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ఐదేళ్ల పాలనలో (2019-24) పారిశ్రామిక రంగంలో రాష్ట్ర పనితీరుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన గణాంకాలతో, కూటమి నేతల అబద్ధాలు బట్టబయలయ్యాయని తెలిపారు.
'ఎక్స్' వేదికగా స్పందించిన జగన్, వైసీపీ ప్రభుత్వం 'బ్రాండ్ ఏపీ'ని నాశనం చేసిందని,మిగతా 2లో...





## పల్లెవెలుగుతో సహా కొత్త ఈవీ బస్సులన్నీ ఏసీవే

### : సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1,450 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు నిర్ణయం
- ఐదేళ్లలో 8,819 డీజిల్ బస్సుల స్థానంలో కొత్త ఈవీ బస్సులు
- గోదావరి పుష్కరాల కోసం జిల్లాల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సూచన

2లో.

ప్రజా రిపబ్లిక్ ప్రతి అక్షరం ప్రజల కోసం RNI No.:2023/87888



# క్వాంటం విప్లవానికి ఏపీనే నాయకత్వం

**(మొదటి పేజీ తరువాయి)**
25 ఏళ్ల క్రితమే ఐటీ విజన్ రూపొందించి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేసిన చంద్రబాబు, అదే తరహాలో ఇప్పుడు క్వాంటం రంగంలోనూ ముందడుగు వేస్తున్నామని చెప్పారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉన్నట్లే, భారత్‌కు క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజ్ఞానం భారతీయుల డీఎన్ఏలోనే ఉందని, క్రీస్తుపూర్వం 2500 నాటికే అర్బన్ ప్లానింగ్, జీరో ఆవిష్కరణ, అడ్వాన్స్ అస్ట్రానమీ వంటి రంగాల్లో భారత్ ప్రపంచానికి దారి చూపిందని వివరించారు. ఒకప్పుడు ప్రపంచ జీడీపీలో 40 శాతం వాటా భారత్‌దేనని, 'బంగారు పిచ్చుక'గా పేరొందిన దేశం ఇప్పుడు ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. హరిత విప్లవం, పారిశ్రామిక విప్లవం తర్వాత టెక్నాలజీ ఆధారిత సేవల రంగంలో భారత్ విప్లవం సాధించిందని చెప్పారు. గూగుల్‌కు సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్‌కు సత్య నాదెళ్ల, ఐబీఎంకు అరవింద్ కృష్ణ వంటి భారతీయులే నాయకత్వం వహించడం దేశ ప్రతిభకు నిదర్శనమన్నారు.

**ఇప్పటికే క్వాంటం స్కిల్ ప్రోగ్రామ్‌కు 54 వేల మంది రిజిస్ట్రేషన్**

ఏపీ అభివృద్ధి ప్రణాళికలను వివరించిన సీఎం, అమరావతిని నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటం వ్యాలీగా, తిరుపతిని స్పేస్ సిటీగా, విశాఖను డేటా సెంటర్ల గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వచ్చే రెండేళ్లలో అమరావతిలోనే క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తి ప్రారంభిస్తామని, లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే క్వాంటం స్కిల్ ప్రోగ్రామ్‌కు 54 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం యువత ఆసక్తికి నిదర్శనమన్నారు.

**ఏపీ నుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే వంద కోట్లు**

క్వాంటం కంప్యూటింగ్ వైద్యం, విద్యుత్, వ్యవసాయం, వాతావరణ అంచనాలు, మెటీరియల్స్ డిస్కవరీ వంటి రంగాల్లో మానవాళికి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. ఏపీ నుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే వంద కోట్లు ఇస్తామని గతంలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసిన సీఎం.. క్వాంటం టెక్నాలజీ ద్వారా దీనిని ఎవరైనా అందిపుచ్చుకుంటే వారికి వందకోట్లు ఇస్తామన్నారు. 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను భారతీయులు అందిపుచ్చుకోవాలని, ఏపీ ఏ టెక్నాలజీ విప్లవానికైనా నాయకత్వం వహిస్తుందన్నారు. విద్యార్థులు ఈ విజన్‌ను అందిపుచ్చుకుంటే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల

## కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ నేతకు కీలక పదవి

న్యూఢిల్లీ,,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా (ఏఎస్‌జీ) ఆయన్ను నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.ఈ నియామకంతో కనకమేడల సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో వాదనలు వినిపిస్తారు. అదనపు సొలిసిటర్ జనరల్ పదవి కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థలో అత్యంత ముఖ్యమైనది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టులలో ప్రభుత్వం తరఫున వాదించాల్సి ఉంటుంది.
కనకమేడల రవీంద్ర కుమార్‌కు న్యాయ, రాజకీయ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టు, హైకోర్టులలో పలు కీలక కేసులను వాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా గతంలో వాదనలు వినిపించారు. రాజ్యాంగం, పరిపాలన అంశాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. 2018 నుంచి 2024 వరకు టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, పార్లమెంటులో చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ లీగల్ సెల్‌లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు.
ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో, ఆ పార్టీకి చెందిన నేతకు ఇంతటి ముఖ్యమైన న్యాయ పదవి దక్కడం రాజకీయంగా కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కేసుల్లో బలమైన న్యాయ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

## పల్లెవెలుగుతో సహా కొత్త

# ఈవీ బస్సులన్నీ ఏసీవే

అమరావతి,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
ఏపీఎస్ఆర్టీసీలో ఇకపై కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లెవెలుగు'కు చెందినవైనా తప్పనిసరిగా ఏసీవే అయ్యుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఈవీనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కొత్త ఎలక్ట్రిక్ బస్సు తప్పనిసరిగా ఏసీ సౌకర్యంతో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే 'పల్లెవెలుగు' బస్సులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిక్ బస్సుల రోడ్‌మ్యాప్‌పై మంగళవారం నాడు సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1,450 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రాబోయే ఐదేళ్లలో మొత్తం 8,819 డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే ప్రణాళికకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. 8 ఏళ్లకు పైబడిన పాత బస్సులను కూడా ఈవీలుగా మార్చాలని నిర్దేశించారు.
రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, గోదావరి జిల్లాల్లో ముందుగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. ఇందుకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పథకం వల్ల పెరిగిన ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు కొత్త బస్సులు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బంగ్లాదేశ్‌లో అల్లర్లు..హిందువుల ఊచకోత

## బంగ్లా హైకమిషన్ ముందు విహెచ్‌పి ఆందోళన

న్యూఢిల్లీ,,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
ఢిల్లీ పోలీసులు హైకమిషన్ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రదర్శకులు బారికేడ్లను నెట్టుకుని లోపలకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఢాకాలో జరిగిన ఘటనను నిరసిస్తూ ప్రదర్శకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వీహెచ్‌పీతో పాటు పలు హిందూ సంస్థలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నాయి. బంగ్లాదేశ్‌లోని మయమన్ సింగ్ జిల్లాలో గత వారం దీపు చంద్ర దాస్ అనే 25 ఏళ్ల హిందూ యువకుడిని దుండగులు గతవారంలో దారుణంగా కొట్టిచంపారు. చెట్టుకు వేలాడదీసి ఉరితీశారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై పడేసి నిప్పుపెట్టారు. ఈ ఘటనపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ దేశాలు సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. దీపు చంద్రదాస్ దారుణ హత్యతో ప్రమేయమున్న 12 మందిని బంగ్లా పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు.
బంగ్లాదేశ్‌లో గత ఏడాది షేక్ హసీనా ప్రభుత్వం గద్దెదిగడానికి దారితీసిన విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన షరీఫ్ ఒస్మాన్ హాదీపై గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల కాల్పులు జరపడం, సింగపూర్‌లో చికిత్స పొందుతూ అతను కన్నుమూయడంతో దేశ వ్యాప్తంగా హింసాకాండ చెలరేగింది. దీనికి కొనసాగింపుగా నేషనల్ సిటిజన్ పార్టీ యువనేత మొతలేబ్ సిక్దార్‌పై సోమవారంనాడు గుర్తుతెలియని సాయుధుడు కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో అతని తల ఎడమ వైపు తూటా దూసుకెళ్లింది. ప్రస్తుతం ఆసుపత్రిలో సిక్దార్ చికిత్స పొందుతున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.
-------------

# ఫోన్‌ట్యాపింగ్ కేసు కీలక మలుపు!

## - కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చే యోచనలో సిట్:

హైదరాబాద్, **డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
ఫోన్‌ట్యాపింగ్ కేసు మరో కీలక మలుపు తిరగబోతున్నది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావులను ఈ కేసులో విచారించడానికి గానూ వారికి నోటీసులు ఇచ్చే యోచనలో సిట్ అధికారులు ఉన్నట్టు తెలిసింది. దీనికి సంబంధించి సిట్ అధిపతి, నగర పోలీసు కమిషనర్ వి.సి సజ్జనార్ తన తోటి విచారణాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగినట్టు ఇప్పటి వరకు సిట్ జరిపిన దర్యాప్తులో బయట పడింది. ఈ కేసులో ఇప్పటి వరకు విచారించిన పోలీసు అధికారుల నుంచి అన్యాపదేశంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కీలక నేతల ఆదేశాల మేరకే ఫోన్‌ట్యాపింగ్ జరిపినట్టు వాంగ్మూలాలనిచ్చిన విషయం తెలిసిందే.
తాజాగా సిట్ కస్టడీలో ఉన్న ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు విచారణలో సైతం తన పైఅధికారుల ఆదేశాల మేరకే ఫోన్‌ట్యాపింగ్ జరిపినట్టు సిట్ అధికారులు వెల్లడించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో అన్ని కోణాల నుంచి విచారిస్తున్న సిట్ అధికారులు.. జరిగిన ఫోన్‌ట్యాపింగ్‌లు దాదాపుగా రాజకీయపరమైనవే కావడం, వాటి వెనుక రాజకీయ దురుద్దేశాలే ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయానికి వచ్చేలా ఉండటంతో సిట్ అధికారులు దీనిని రాజకీయ కోణంలో కూడా చూస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావులను విచారించాలనే యోచన సాగిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఒకట్రెండ్రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశమున్నదని సమాచారం.అదేసమయంలో ప్రభాకర్‌రావు ఎస్ఐబీ ఓఎస్డీగా ఉన్న సమయంలో రాష్ట్ర డీజీపీగా పని చేసిన మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేసిన అదనపు డీజీ అనిల్ కుమార్‌లను సైతం విచారించడానికి సిట్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇక మంగళవారం నాలుగో రోజు తమ కస్టడీలో ఉన్న ప్రభాకర్‌రావును ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఇమిడి ఉన్న కొలిక్కిరాని వ్యవహారాలపై సిట్ అధికారులు విచారించారని సమాచారం.

# అన్నీ అబద్ధాలే :ఆర్బీఐ డేటా చెబుతోంది: జగన్

**(మొదటి పేజీ తరువాయి)**
పెట్టుబడిదారులను తరిమేసిందని టీడీపీ-జనసేన నిరంతరం ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ ఆరోపణల్లో కొంచెమైనా నిజం ఉండి ఉంటే పారిశ్రామిక రంగంలో ఏపీ పనితీరు దారుణంగా ఉండేదని, కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఆర్బీఐ లెక్కల ప్రకారం 2019–24 మధ్య తయారీ రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలో ప్రథమ స్థానంలో, దేశంలో ఐదో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అలాగే, పారిశ్రామిక వృద్ధిలో కూడా దక్షిణాన మొదటి స్థానంలో, దేశవ్యాప్తంగా 8వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. "ఇది బ్రాండ్ ఏపీని నాశనం చేయడమా? లేక పరివర్తనాత్మక నాయకత్వంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమా?" అని జగన్ ప్రశ్నించారు.

**పవన్ రౌడీ భాష మాట్లాడుతున్నారు: అంబటి రాంబాబు**

ఇదిలా ఉండగా, వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ ప్రసంగాలు దూకుడుగా, గందరగోళంగా ఉంటున్నాయని, ఆయన మాటలు ఆయనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పవన్ రౌడీ భాష మాట్లాడటం తగదని హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ స్కామ్‌పై భయంతోనే పవన్ తమ పార్టీపై విమర్శలు చేస్తున్నారని అంబటి ఆరోపించారు. చంద్రబాబు ఈ కాలేజీలను తన అనుచరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఈ వ్యవహారంలో పవన్‌కు కూడా వాటా ఉందేమోనన్న అనుమానం కలుగుతోందని ఆయన అన్నారు.

# ఈ నెలాఖరు నుంచే కుటుంబ సర్వే

**(మొదటి పేజీ తరువాయి)**
రాష్ట్రంలోని ప్రతి కుటుంబ ప్రస్తుత పరిస్థితిని ధ్రువీకరించడానికి, నవీకరించడానికి ప్రభుత్వ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి అర్హత కలిగిన ఏ కుటుంబం లేదా వ్యక్తి తప్పించుకోకుండా చూడటమే ఈ సర్వే ముఖ్య లక్ష్యం. ఖచ్చితమైన నూతనంగా తీసుకున్న కుటుంబ రికార్డులు ప్రభుత్వ ధ్రువపత్రాలు, ఆమోదాలను జారీ చేయడానికి సమయం ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా అన్ని విభాగాల్లో అనవసరంగా ఉన్న వాటిని ధ్రువీకరించాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ సమాచారం ఖచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపరచడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి దగ్గర నవీకరించడం ద్వారా ప్రభుత్వ విధానాలను, పథకాలను మరింత సమర్థవంతంగా ప్లాన్ చేసి అమలు చేసే అవకాశం ఉందని అనుకుంటుంది. సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్తు సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనను మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. ప్రభుత్వ సిబ్బంది ఈ సర్వేను ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నిర్వహించనున్నారు. తద్వారా సమాచారం త్వరగా, ఖచ్చితంగా
నమోదు చేయనున్నారు. సాధ్యమైన ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన రికార్డులను, సమాధానాలను ముందస్తుగా పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు. తద్వారా ప్రతి కుటుంబానికి పట్టే సమయం తగ్గనుంది. ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించి గుర్తింపు ధ్రువీకరణను సురక్షితంగా నిర్వహిస్తారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుతూ రికార్డులు సరైనవని నిర్ధారించనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా పని చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. పౌర కేంద్రీకృత పాలన దిశగా ఏకీకృత కుటుంబ సర్వే ఒక ముఖ్యమైన అడుగుగా ప్రభుత్వం అనుకుంటుంది. సర్వేయర్లకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారా, పౌరులు తమ కుటుంబ వివరాలు అలాగే ఉన్నాయని, వారు ప్రభుత్వ సేవలను సజావుగా పొందుతున్నారని నిర్ధారించుకోవడంలో సహాయపడుతుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సేవల పంపిణీని మెరుగుపరచడానికి, జీవన నాణ్యతను పెంచడానికి డిజిటల్ టెక్నాలజీ, ప్రజా – స్నేహపూర్వక విధానాలను ఉపయోగించేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.

# వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు

**(మొదటి పేజీ తరువాయి)**
వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రం చేశారు. ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టీటీడీ చేసిన ఏర్పాట్ల గురించి ఈవో మాట్లాడుతూ డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల కోసం పగడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా అధికార యంత్రాంగం తనిఖీలు నిర్వహించి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, అన్న ప్రసాదాలు, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలపై ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు వైకుంఠ ఏకాదశిపై ప్రత్యేక బోర్డు సమావేశం నిర్వహించి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సామాన్య భక్తులకు ఈ-డిప్ విధానం ద్వారా దర్శన టోకెన్లు కేటాయించామన్నారు. భక్తులందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐదు రోజుల పాటు ఈ-డిప్ రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించామన్నారు. దాదాపు 24 లక్షల మంది భక్తులు ఈ-డిప్ కు రిజిస్ట్రేన్ చేసుకోగా మొదటి మూడు రోజులకు 1.89 లక్షల భక్తులను ఈ-డిన్ ద్వారా ఎంపిక చేసి టోకెన్లు కేటాయించామని తెలిపారు. ఈ మూడు రోజులకు టోకెన్లు పొందిన భక్తులకు నిర్దేశిత తేది, సమయాన్ని కేటాయించడం జరిగిందని, ఆ సమయం ప్రకారమే భక్తులు దర్శనానికి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకుండా రెండు గంటల్లోనే దర్శనభాగ్యం కలుగుతుందని అన్నారు.ఈ-డిప్ ద్వారా టోకెన్ పొందలేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వ దర్శనం క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొదటి మూడు రోజులు మాత్రమే ఈ-డిప్ విధానంలో టోకెన్లు కేటాయించామని, చివరి ఏడు రోజులు భక్తులు నేరుగా తిరుమలకు వచ్చి సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అదేవిధంగా జనవరి 2 నుండి 8వ తేది వరకు రోజుకు 15 వేల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను, 1500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ లో విడుదల చేశామని చెప్పారు. తిరుపతి, తిరుమల స్థానికులకు స్థానికుల కోటా కింద జనవరి 6,7,8 తేదీల్లో రోజుకు 5వేల టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు.వైకుంఠ ద్వార దర్శనాలకు
అధిక సంఖ్యలో భక్తులు వచ్చే కారణంగా చంటి పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ వంటి ప్రత్యేక దర్శనాలను రద్దు చేశామని చెప్పారు.శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భద్రతకు సంబంధించి 3500 మంది పోలీసులు, 1150 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుని భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు.భక్తులందరూ టీటీడీ సూచనలు పాటిస్తూ సంయమనంతో స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులవ్వాలని ఈవో తెలియజేశారు.

# నేడు నింగిలోకి బ్లూబర్డ్ బ్లాక్-2

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

అమరావతి,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది.
ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3-ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది.
శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

# నేర నివారణే ప్రథమ లక్ష్యం

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**రౌడీషీటర్ల జియో ట్యాగింగ్, ఉద్యోగ మోసాలు%-%ల్యాండ్ మాఫియాపై కఠిన చర్యలు**

**కేసుల చేధన, రికవరీలపై ప్రత్యేక దృష్టి బాధితులకు న్యాయం చేయాలి**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**
నేర నివారణే ప్రథమ లక్ష్యంగా ప్రతి పోలీసు అధికారి పని చేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ స్పష్టం చేశారు. ఏపీ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి లోకేషన్లను జియో ట్యాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.మంగళవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను ఉద్దేశించి ఎస్పీ గారు మాట్లాడారు.

దొంగతనాలు, ప్రాపర్టీ కేసులను సమర్థవంతంగా చేధించి రికవరీ శాతాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. ఉద్యోగాల పేరుతో మోసాలు, ల్యాండ్ మాఫియా కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

సంవత్సారాంతం దృష్ట్యా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, జనవరి నెల నుండి ప్రతి రౌడీషీట్, సస్పెక్ట్ షీట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు (ఫోటోలు, ఆధార్, బ్యాంకు వివరాలు, ఫోన్ నంబర్లు, జియో ట్యాగ్ చేసిన లొకేషన్లు) సిసిటీఎన్ఎస్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై జిల్లా బహిష్కరణ, పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అయితే 2015 నుండి 2025 వరకు ఎలాంటి కేసులు లేకుండా మంచి నడవడిక కలిగిన రౌడీషీటర్లను సమగ్రంగా సమీక్షించి, అవసరమైతే రౌడీషీట్‌ల నుండి తొలగించే విధంగా చూడాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి జిగ్‌జాగ్ డ్రమ్ములు, స్పీడ్ బ్రేకర్లు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పెండింగ్ కేసులను తగ్గించడంతో పాటు, ప్రాపర్టీ మరియు దొంగతన కేసులను వేగంగా చేధించి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. మహిళలపై నేరాల నివారణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

పోక్సో కేసులు, బాలికల మిస్సింగ్, గ్రేవ్ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసులో 'ఈ-సాక్ష్య' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లతో పెండింగ్ కేసుల దర్యాప్తును పకడ్బందీగా చేయించాలని, ప్రొబేషన్ ఎస్సైలు మరింత సమర్థంగా పని చేయాలని చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన ట్రయల్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.




వచ్చే నూతన సంవత్సరంలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఉలిందకొండ పరిధిలో ఎటిఎం చోరీ ప్రయత్నం కేసులో డీజీపీ నుండి ఏబీసీడీ అవార్డు పొందిన పోలీసులను, అలాగే గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, హేమలత, భార్గవి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# నవోదయం 2.0పై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశంనాటు సారాయి మానేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనపై విస్తృత చర్చ



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**
నాటు సారాయి తయారీ, అమ్మకాలను శాశ్వతంగా మానివేసిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో 'నవోదయం 2.0' కార్యక్రమం కింద వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశాల మేరకు గురువారం జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నాటు సారాయి తయారీని మానివేసి ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం ముందుకు వచ్చిన 246 మంది పాత నేరస్తులకు అర్హత గల రుణాలు, సబ్సిడీ రుణాలు, అవసరమైన నైపుణ్య శిక్షణ అవకాశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే బంగారుపేట ప్రాంతానికి చెందిన 10 మంది నాటు సారాయి తయారీని పూర్తిగా మానివేసి ఇతర ఉపాధి వైపు అడుగులు వేయగా, వారికి రూ.20 లక్షల రుణం మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రోత్సాహంతో మరింత మంది నాటు సారాయి తయారీని విడిచిపెట్టి చట్టబద్ధమైన ఉపాధి మార్గాల వైపు రావాలని అధికారులు ఆకాంక్షించారు.ఈ సమావేశాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఎం.సుధీర్ బాబు, మెప్మా పీడీ శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ వెంకట రమణరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి, ఎస్టీ కార్పొరేషన్ ఈడీలు జాకీర్ హుస్సేన్, సురేష్, ఏఈఎస్‌లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, మంజుల, సువర్ణలత, లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.ద

# చిప్పగిరి పోలీసులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందన





**చిప్పగిరి, డిసెంబర్, 23,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్ పోలీస్ సిబ్బంది షబ్బీర్, శంకర్ ను మంగళవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు, దేగులహాళ్ గ్రామంలో గంజాయి సాగు చేస్తున్న పంటను గుర్తించి నందుకు అభినందించారు, ఈ కార్యక్రమంలో పత్తికొండ డిఎస్పి వెంకట రామయ్య పాల్గొన్నారు.



# పూలే అంబేడ్కర్ సొసైటీ ఆశ్రమంలో నూతన వస్త్రాలు నిత్యావసర సరుకులు పంపిణీ

**అందజేసిన కదిరికోట శాలేమ్, సింగనేటి నరసన్న**




**ఎమ్మిగనూరు, డిసెంబర్, 23,(రిపబ్లిక్ న్యూస్):** కదిరికోట శాలేమ్ సింగనేటి నరసన్న సామాజిక సేవా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రిస్మస్ శుభ సందర్భంలో అనాధలు దిక్కులేని వారు వృద్ధులకు అన్నదానం చేసి నూతన వస్త్రాలు నిత్యావసర సరుకులు బియ్యము బ్యాళ్ళు మంచి నూనె మొదలగునవి అందజేశారు క్రీస్తు చూపిన మార్గంలో నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము అన్న మాటలు గుర్తు చేసుకుంటూ మన దగ్గర ఉన్నది కొంత సహాయం బీదలకు దిక్కులేని వారికి విధవరాలుకు సహాయం అందించినప్పుడే ఈ లోకమాలీన్యము తనకు అంటకుండా తన్నుతాను కాపాడుకుంటాడని చెప్పిన ఈ గొప్ప మాటను బట్టి ఎంతోమంది క్రైస్తవ మిషనరీలు ఈ భారత దేశంలో విద్యా వైద్యం న్యాయం అందించారని గుర్తు చేసుకుంటున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కమిటీ సభ్యులు జెపి నాగప్ప, అశోక్ చక్రవర్తి,పూజారి మోహన్,రామాంజనేయులు,విల్సన్ తదితరులు పాల్గొన్నారు

# అవినీతి అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**జిల్లాలో రీసర్వే సమస్యలకు అసిస్టెంట్ డైరెక్టర్, సీనియర్ డ్రాఫ్ట్‌మ్యాన్‌లే కారణం**

**రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు వి.వి. నాయుడు డిమాండ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**
రీసర్వే పేరుతో రైతులను వేధిస్తున్న అవినీతి అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వి.వి. నాయుడు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని బిర్లా కంపౌండ్ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా వి.వి. నాయుడు, సీమకృష్ణలు మాట్లాడుతూ రీసర్వే తప్పిదాలను సరిచేసే ప్రక్రియలో అసిస్టెంట్ డైరెక్టర్ ముని కన్నన్, సీనియర్ డ్రాఫ్ట్‌మ్యాన్ రుద్రమునిల అవినీతి పరాకాష్ఠకు చేరిందని తీవ్ర ఆరోపణలు చేశారు.రీసర్వేలో విస్తీర్ణం తప్పుగా నమోదు కావడం, ఎల్పీఎం నెంబర్లు మారిపోవడం, ఒక సర్వే నంబరులో మరో ఎల్పీఎం కలిసిపోవడం, జాయింట్ ఎల్పీఎం పడిపోవడం, భూమి స్వభావం తప్పుగా నమోదు కావడం వంటి అనేక సమస్యలతో గ్రామీణ ప్రాంత రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్ ఫిర్యాదుల్లో 70 శాతం పైగా భూముల సమస్యలేనని పేర్కొన్నారు. రీసర్వే తప్పిదాలను సరిచేయాలంటే మళ్లీ నోటీసులు ఇవ్వాలి, సర్వే చేయాలి, పక్కన రైతుల సంతకాలు తీసుకోవాల్సి వస్తుందని, కొందరు రైతులు సహకరించకపోవడం, రిజిస్టర్డ్ పోస్టుల ద్వారా నోటీసులు పంపినా స్పందన లేకపోవడం వంటి గ్రౌండ్ లెవల్ సమస్యలు ఉన్నాయని వివరించారు.

గ్రామ, మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించి ఫైళు జిల్లా స్థాయికి పంపినా, అక్కడ లాగిన్ అధికారాలున్న అసిస్టెంట్ డైరెక్టర్, సీనియర్ డ్రాఫ్ట్‌మ్యాన్ చిన్న చిన్న సాకులు చూపిస్తూ ఫైళ్లను తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. ఒకసారి ఫైల్ తిరస్కరణకు గురైతే, మళ్లీ మొదటి లాగిన్ నుంచే ప్రక్రియ ప్రారంభం కావడంతో రైతులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోయారు.గ్రౌండ్ లెవల్ సమస్యలను జిల్లా స్థాయి లాగిన్‌ల వరకు తీసుకెళ్లడం వల్ల అవినీతి మరింత పెరిగిందని, లాగిన్ ఆమోదం కావాలంటే ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు తమకు వెల్లడించారని తెలిపారు. లంచం ఇవ్వని ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్నారని విమర్శించారు.

గ్రౌండ్ లెవల్ సమస్యలపై అవగాహన లేని వారికి లాగిన్ హక్కులు ఎందుకు ఇచ్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రీసర్వేలో ఏవైనా తప్పిదాలు జరిగితే వాటి బాధ్యతను గ్రామ స్థాయి అధికారులపై నెట్టేస్తున్నారని, అందుకే ఈ ఇద్దరు అధికారుల లాగిన్ హక్కులను పూర్తిగా తొలగించాలని కోరారు.

రైతు భూమిని రైతుకే సరిచేసి ఇవ్వడానికి లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని, జిల్లాలో రీసర్వే సమస్యలు పరిష్కారం కాకపోవడానికి ప్రధాన కారణం వీరిద్దరేనని స్పష్టం చేశారు.జాయింట్ కలెక్టర్ ఇటీవల నియమితులైన నేపథ్యంలో ప్రతీ అంశానికి వీరినే అడిగి లాగిన్‌లను ఆమోదిస్తున్నారని, దీనివల్ల వీరి ఇష్టారాజ్యం మరింత పెరిగిందని ఆరోపించారు. గతంలో జిల్లా స్థాయికి ఫైల్ వచ్చిందంటే అన్ని ప్రక్రియలు సక్రమంగానే ఉన్నాయని భావించేవారని గుర్తు చేశారు.గ్రామ సర్వేయర్ల బదిలీల సమయంలో కోరుకున్న గ్రామాల్లో పోస్టింగ్ కావాలంటే ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల రూపాయల వరకు వసూలు చేశారనే ఆరోపణలు కూడా చేశారు. క్రింది స్థాయి ఉద్యోగులు కావడంతో వారు బయటకు వచ్చి మాట్లాడే పరిస్థితి లేదని తెలిపారు.

తక్షణమే ఈ అవినీతి అధికారులపై చర్యలు తీసుకుని, రీసర్వే సమస్యలను వేగంగా పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు రామిరెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు, వీరేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి



**ఓర్వకల్ ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**



మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలని నన్ను రు జగనన్న లేఔట్ లో ఇల్లు మంజూరైన లబ్ధిదారులతో మండల ప్రత్యేక అధికారి మరియు ముఖ్య కార్యనిర్వాహణాధికారి జిల్లా ప్రజా పరిషత్ కర్నూలు నాసర రెడ్డి లబ్ధిదారులను మోటివేట్ చేయడం జరిగినది.లబ్ధిదారులకు ఉపాధి హామీ నిధులు ఇంకను జమ కాలేదని తెలియ చేయగా వెంటనే ఉపాధి హామీ సిబ్బంది తో సమస్య పరిష్కారం నకు హామీ ఇవ్వడం జరిగినది

# గృహ నిర్మాణాల్లో వేగం పెంచాలి

**నిర్దేశిత గడువులో ఇళ్ల పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**

ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలను వేగవంతం చేసి, లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లను నిర్దేశిత గడువులో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కోసిగి మండలం నేల కోసిగి గ్రామంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ లేఅవుట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.గ్రామంలో మొత్తం 71 గృహాలు మంజూరుకాగా, వాటిలో 59 గృహాలు బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. అలాగే 3 గృహాలు రూఫ్ లెవెల్‌లో, 5 గృహాలు ఆర్‌సీసీ స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిన గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేసి, పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.హౌసింగ్ కాలనీలో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వీధి దీపాలు, రహదారులు, తాగునీటి సరఫరా, డ్రెయినేజ్ వంటి ప్రాథమిక సదుపాయాలను సమయానుకూలంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.తదుపరి ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసుకున్న లబ్ధిదారుడు బసన్న గౌడ్ గృహాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ సహకారంతో సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారుడు తెలియజేయగా, కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి, డిపిఓ భాస్కర్, తహసీల్దార్ వేణుగోపాల్ శర్మ, ఎంపీడీవో మహబూబ్ భాషా, హౌసింగ్ డిప్యూటీ ఇంజినీర్ లాల్ స్వామి, ఏఈ స్వరూప్, గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారి తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం

# యధావిధిగా కొనసాగించాలి

### కొత్తగా తెచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి - అఖిల భారత రైతుకూలీ సంఘం డిమాండ్





**గుంతకల్ డిసెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)**
మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంఅనంతపురం జిల్లా గుంతకల్ పట్టణములోని తాహసిల్దార్ వారికి అఖిల భారత రైతుకులీ సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది ప్రధానమైన డిమాండ్ గతంలో 2004 సంవత్సరంలో పేద ప్రజలకి వరంగా రైతులకు అన్ని వర్గాల ప్రజలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్రం తీసుకొచ్చింది కేంద్రం నుండి 90% నిధులు వచ్చేటివి ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దుచేసి పార్లమెంటులో మోజువాని ఓటుతో జి రామ్ జి పేరు మీద చట్టం తీసుకొచ్చింది పేద ప్రజలకు అన్యాయం జరిగే విధంగా రాబోయే కాలంలో ఈ చట్టాన్ని పూర్తిగా తీసివేయాలని కుట్ర పన్నినది రాష్ట్రాలు ఫార్టీ పర్సెంట్వు ఇవ్వాలని కేంద్రం 60% చేయాలని రాష్ట్రాల మీద బలవంతంగా దిద్దుతున్నది 2004లో తెచ్చినటువంటి చట్టం అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉన్నది కాబట్టి ఆ చట్టాన్ని కొనసాగించాలని కొత్తగా తెచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించడమైనది గుంతకల్ ఎమ్మార్వో గారికి మేము రాండంఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి రైతు కూలిసంఘం గుంతకల్ డివిజన్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు డివిజన్ కమిటీ సభ్యులు జక్కన్న కళావతి లక్ష్మయ్య చిన్న పుల్లన్న నరసింహులు శాంతమ్మ రమాదేవి జ్యోతి మస్తానమ్మ ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ పట్టణ పేదల సంఘం నుండి ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఐఎఫ్టియు నుండి జిల్లా కమిటీ సభ్యుడి ఎర్రిస్వామి తదితరులు పాల్గొని మెమో రాండం ఇవ్వడం జరిగింది

## పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ భారతికి జై కిసాన్ అవార్డు



**గుత్తి డిసెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)** అనంతపురం నగరంలోని జెడ్పి పరిషత్ నందు మంగళవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా గుత్తి పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.భారతి ఉత్తమ జై కిషన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జై కిసాన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 8వ జై కిషన్ ఫౌండేషన్ పురస్కారాలు 2025 నిర్వహించారు.ఇందులో భాగంగా ఉత్తమ జై కిసాన్ అవార్డును అందుకోవటం జరిగిందని తెలిపారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీ ఎఫ్ సీసీఐ జిల్లా కార్యదర్శిగా మాకం శ్రీకాంత్



**గుత్తి డిసెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)** అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ (ఏపీఎఫ్ సీసీఐ) జిల్లా కార్యదర్శిగా గుత్తి పట్టణానికి చెందిన మాకం శ్రీకాంత్ నియమితుడయ్యారు. సోమవారం ఏపీఎఫ్ సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాకం శ్రీకాంత్ మాట్లాడుతూ.. పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహానికి తన వంతు కృషి చేస్తానని వారు పేర్కొన్నారు.అనంతరం ఏపీ ఎస్ సి సి ఐ జిల్లా కార్యదర్శి మాకం శ్రీకాంత్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## 5సబ్ స్టేషన్లు, భూగర్భ విద్యుత్ కేబుల్ కు ప్రతిపాదనలు

### మంత్రి గొట్టిపాటిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

#### 5ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు

#### మెరుగైన భద్రత కోసం భూగర్భ కేబుల్ వేయాలని విజ్ఞప్తి



**అనంతపురం విద్యుత్తు, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలో విద్యుత్ వినియోగం రోజు రోజుకీ ఎక్కువ అవుతున్న నేపథ్యంలో నాణ్యమైన సరఫరా కోసం అదనపు విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృషి చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయించిన ఎమ్మెల్యే మంగళవారం విజయవాడలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కలిశారు. నగరంలో విద్యుత్ డిమాండ్‌ను ఎక్కువగా ఉందని, నివాస, వాణిజ్య రంగాలకు నిరంతరాయంగా సరఫరాను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఐదు అదనపు 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయాలని కోరారు. ఇందులో లక్ష్మీనగర్ (ఇండోర్), ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, ఏ.నారాయణపురం, ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతం, కళ్యాణదుర్గం రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందన్నారు. ఇందుకు అవసరం ఉన్న అంచనాలను మంత్రికి వివరించారు. మరోవైపు పెరుగుతున్న పట్టణ మౌళిక సదుపాయాల కోసం, భద్రత దృష్ట్యా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి గొట్టిపాటి సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనలపై అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నగరంలో విద్యుత్ సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. భవిష్యత్ లో ఎక్కడా అవాంతరాలు లేకుండా అదనపు సబ్ స్టేషన్లు తీసుకురావడంతో పాటు అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## కొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి

### - అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్






**అనంతపురం ప్రతినిధి, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):**
గుంతకల్ పట్టణంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. అందులో భాగంగా పేద ప్రజలకి వరంగా రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్రం తీసుకొచ్చిందని పేర్కొన్నారు.కేంద్రం నుండి 90 శాతం నిధులు వచ్చేటివని, ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దుచేసి పార్లమెంటులో మోజువాని ఓటుతో జిరామ్ జి పేరు మీద చట్టం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తొలగించాలని కుట్రఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి కృష్ణ, పట్టణ పేదల సంఘం ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రిస్వామిమాట్లాడుతూ ... ప్రజలకు అన్యాయం జరిగే విధంగా రాబోయే కాలంలో ఈ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తొలగించాలని కుట్ర పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాలు ఫార్టీ పర్సెంట్ ఇవ్వాలని కేంద్రం 60 శాతం చేయాలని, రాష్ట్రాల మీద బలవంతంగా దిద్దుతున్నదని మండిపడ్డారు. 2004లో తెచ్చినటువంటి చట్టం అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉన్నది కాబట్టి ఆ చట్టాన్ని కొనసాగించాలన్నారు. కొత్తగా తెచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం మండల తహసిల్దార్ గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి రైతు కూలిసంఘం డివిజన్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు, డివిజన్ కమిటీ సభ్యులు జక్కన్న, కళావతి, లక్ష్మయ్య, చిన్న పుల్లన్న, నరసింహులు, శాంతమ్మ, రమాదేవి, జ్యోతి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

### యువనేత కాటసాని శివ నరసింహా రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా

## వైయస్సార్సీపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి మిత్ర బృందం

**కల్లూరు ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మంగళవారం రోజున కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటిదగ్గర కాటసాని వారసుడు, పాణ్యం యువ నాయకుడు మా యువనేత కాటసాని శివ నరసింహ రెడ్డి జన్మదినం సందర్భంగా పాణ్యం నియోజకవర్గం పరిధిలోని : వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నివాసం దగ్గర పుట్టినరోజు వేడుకలు ఎద్దుల శివారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి KSNRకి వీడియో కాల్ ద్వారా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల జిల్లా,మరియు నియోజకవర్గ అధ్యక్షులు,నాయకులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు,అభిమానులు కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు






## స్టేట్ లెవెల్ సెలెక్టెడ్ కబడ్డీ పోటీలకు బేతంచెర్ల గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ స్టూడెంట్ హర్షవర్ధన్ గౌడ్



**బేతంచెర్ల ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మంగళవారం రోజున బేతంచెర్ల మండల కేంద్రంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ మెకానికల్ ఇంజనీరింగ్ స్టూడెంట్ స్టేట్ లెవెల్ సెలెక్టెడ్ కబడ్డీ పోటీలకు సెలెక్ట్ అయిన అబ్బాయి ఓర్వకల్లు మండలం శకునాల గ్రామానికి చెందిన ఈడిగ హర్ష వర్ధన్ గౌడ్ కాలేజీ తరఫున అభినందించారు

## అంగన్వాడి ఉద్యోగులకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన పాణ్యం ఎమ్మెల్యే



**కల్లూరు ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మంగళవారం రోజు మాధవి నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గడివేముల పాణ్యం మండలాల అంగన్వాడి ఉద్యోగులకు ప్రభుత్వం మంజూరు చేసిన మొబైల్ ఫోన్లను టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిచేతుల మీదగా పంపిణీ చేశారు, ఈ ఫోన్లద్వారా ఆన్లైన్ రిపోర్టింగ్ సేవలు మరింత వేగవంతం అవుతాయని పాణ్యం ఎమ్మెల్యే తెలిపారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉద్యోగులు టిడిపి నాయకులు పాల్గొనడం జరిగింది

# ఆన్‌లైన్ ట్రేడింగ్ పట్ల జాగ్రత్త పడాలి

### అనుమనిత గ్రూపులకు ఆకర్శితులు కావద్దు -పంజాబ్ మాజీ ఐపిఎస్ ఉదంతంతో క్రైమ్ పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్,డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్):**ఆన్‌లైన్ ట్రేడింగ్ పట్ల జాగ్రత్త పడాలని, అనుమనిత గ్రూపులకు ఆకర్శితులు కావద్దని, పంజాబ్ మాజీ ఐపిఎస్ ఉదంతంతో క్రైమ్ పోలీసుల హెచ్చరిక చేశారు. సోషల్ మీడియా, టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపుల ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు గణనీయంగా పెరుగుతున్నాయి. క్రిప్టో కరెన్సీ, ఫారెక్స్, స్టాక్ ట్రేడింగ్‌లో అత్యధిక లేదా గ్యారంటీ లాభాల పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు అమాయకులకు టోకరా వేస్తున్నారు. బాధితులను ఆకర్షించి, వెబ్‌సైట్లు, ట్రేడింగ్ డాష్‌బోర్డులు, యాప్స్ ద్వారా నకిలీ లాభాలు చూపిస్తూ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ప్రలోభ పెడుతున్నారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ క్రైమ్ యూనిట్ పౌరులకు సూచించింది. పంజాబ్ కేడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అమర్ సింగ్ చాహల్ ఇలానే వాట్సప్ ఆధారిత పెట్టుబడి మోసానికి గురై సుమారు 8.10 కోట్లు పోగొట్టుకున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. 2 నెలల పాటు మోసగాళ్ల వలకు చిక్కి.. స్నేహితులు, బంధువుల వద్ద సుమారు రూ.7.5 కోట్ల మేర అప్పుగా తీసుకున్నారని తెలిపారు. తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికిలోనై చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డారని




పేర్కొన్నారు. సైబర్ పెట్టుబడి మోసాల వల్ల కలిగే భయంకర పరిణామాలను ఈ ఉదంతం తెలియజేస్తోందని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు నిర్ధారణ కాని పెట్టుబడి ప్లాట్‌ఫారాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో లాభాలను చూపించే ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు పౌరులకు సూచించారు.
ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సప్‌లో తెలియని వ్యక్తి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌గా నటిస్తూ సందేశం వస్తుంది. తొలుత నమ్మకం కలిగించి, ఆపై త్వరగా లాభాలు వచ్చే ట్రేడింగ్ అవకాశాలను పరిచయం చేస్తాడు. ఆరంభంలో తక్కువ మొత్తంతో పెట్టుబడి పెట్టాలని చెబుతారు. వాట్సప్‌లో నిరంతరం మార్గదర్శనం చేస్తూ నిజమైన ట్రేడింగ్ జరుగుతున్నట్టు భ్రమ కలిగిస్తారు. పెట్టుబడి తర్వాత బాధితుడికి మోసపూరితంగా రూపొందించిన ప్లాట్‌ఫారమ్‌లో నకిలీ లాభాలు చూపిస్తారు. అవి నిజమైన లాభాలేనని బాధితుడు నమ్మేలా చేస్తారు. బాధితుడు డబ్బు విత్‌డ్రా చేయాలనగానే.. ట్యాక్స్, కరెన్సీ కన్వర్షన్, విత్‌డ్రాయల్ ఫీజులు, కంప్లయెన్స్ ఛార్జీల వంటి పేర్లతో చెల్లింపులు అడుగుతారు. ఇలా చెల్లించిన ప్రతిసారీ కొత్త కారణం చెప్పి మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. బాధితుడు సందేహించగానే లీగల్ యాక్షన్ తీసుకుంటామని, లేదా వాలెట్ ఫ్రీజ్ అవుతుందని భయపెడతారు. బాధితుడు మరింత చెల్లిస్తూనే ఉంటాడే తప్ప.. సొమ్ము విత్‌డ్రా ఎప్పటికీ జరగదు. అప్పటికి గానీ అది సైబర్ మోసమని బాధితులు తెలుసుకోలేకపోతున్నారని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గ్యారంటీగా వస్తాయని చెప్పేవారిని విశ్వసించొద్దు. పెట్టుబడులకు ఎల్లప్పుడూ రిస్క్ ఉంటుందన్నారు. బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్‌లు వంటివి ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.

# పదవ తరగతిలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలి

**డ్రాప్ అవుట్‌లు లేకుండా చర్యలు :మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి :జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**
పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మంత్రాలయం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి, వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతిలో ఉన్న విద్యార్థుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మొత్తం 918 మంది విద్యార్థులు చదువుతుండగా, 24 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయినట్లు ఉపాధ్యాయులు వివరించారు. వలస వెళ్లిన ఈ 24 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించి, వారు తప్పనిసరిగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక అమలుపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ సబ్జెక్ట్ వారీగా బోధన జరుగుతోందా, రోజువారీ పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను సాయంత్రం లోపు సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నారా అనే అంశాలను సవివరంగా పరిశీలించారు. విద్యార్థుల్లో ఉన్న అభ్యసన లోపాలను గుర్తించి, వెంటనే పరిష్కరించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, క్రమశిక్షణతో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం తప్పనిసరిప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన, పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో విద్యార్థులకు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భోజన పథకం అమలులో ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా రుచి చూసి పరిశీలించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా సరిపడా పరిమాణంలో భోజనం అందించాలని స్పష్టం చేశారు. వంటశాలలు పరిశుభ్రంగా ఉంచాలని, వంట పాత్రలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, తాగునీరు సురక్షితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వంట సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, మంత్రాలయం నియోజకవర్గ మండల స్పెషల్ అధికారి / డీపీవో భాస్కర్, మంత్రాలయం టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆదోని ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి వసుంధర దేవి, మంత్రాలయం తహసిల్దార్ రమాదేవి, ఎంపిడీఓ నూర్జహాన్, ఎంఈఓ రాగన్న, మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం



**ఓర్వకల్ ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మంగళవారం రోజున,గ్రామంలో ఇంటి యజమానులకు వారు నివసించుచున్న ఇళ్లపై యాజమాన్య హక్కులు కల్పించే నిమిత్తం స్వామిత్వ కింద ఇంజనీరింగ్ సహాయకులు డిజిటల్ సహాయకులు పంచాయతీ కార్యదర్శులు సర్వేయర్ లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది, ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యకారణ నిర్వహణ అధికారి మరియు జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి శ్రీ నాసర్ రెడ్డి పాల్గొనడం జరిగినది ఈ శిక్షణ కార్యక్రమం ఉద్దేశించి గ్రామంలో ఈ విధంగా అయితే రైతులకు వారి యొక్క భూములకు సంబంధించి కొలతలు వేసి యాజమాన్య హక్కులు కల్పిస్తున్నారో ఆ విధంగా గ్రామాలలో వారు నివసించుచున్న ఇంటి యజమానులకు కొలతలు వేసి ఆన్లైన్లో రికార్డు నమోదు చేసి యాజమాన్య హక్కు కల్పిస్తూ కార్డులు జారీ చేయుటకు సంకల్పించడం జరిగినది అందులో భాగంగా ఇంజనీరింగ్ సహాయకులు, గ్రామ సర్వేయర్ వారు ప్రతి ఇంటికి గల హద్దులు ఇంటి కొలతల వివరములతో అప్డేషన్ చేసి ఆన్లైన్లో నమోదు చేయించి స్వర్ణ పంచాయతీ పోర్టల్ నందలి స్వామిత్వ నందు పంచాయతీ కార్యదర్శి ద్వారా జిల్లా కలెక్టర్ కి అప్రూవల్ కి పంపడం జరుగుతుంది,తదుపరి రాబోవు కాలంలో వారి యొక్క ఆస్తులను ఎలాంటి ఇబ్బంది లేకుండా బదలాయింపుకు, ఎలాంటి ఆటంకాలు లేకుండా బ్యాంకు రుణాలు పొందుటకు సులభతరం చేయుచున్నది. గ్రామపంచాయతీ వారు వారి యొక్క సొంత ఆదాయ వనరులను పెంపుదల చేసుకొనుటకు గల మార్గాలపై అవగాహన కల్పించడం జరిగినది. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించుటకు ఈ యొక్క సర్వే ఉపయోగకరంగా ఉంటుంది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగఅనసూయ మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి శాంతయ్య ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాస్టర్ ట్రైనర్లు గోపాల్,పావని,ఆర్ చరణ్ కుమార్, పవన్, విజయ్ శ్రీనివాస్ పాల్గొనడం జరిగినది

## లొద్ది పల్లెలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

**- ఎస్సీ కాలనీ అభివృద్ధికి రూ.20 లక్షల మంజూరు**






**ఓర్వకల్ ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్ మండలం లొద్ది పల్లె గ్రామంలో న్యూ కర్నూలు జిల్లా అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కేతిరుపాల్ రెడ్డి %–% ఉమాదేవి, కె. వెంకటరామిరెడ్డి %–% కె. రామేశ్వరమ్మ దంపతులు సహకారం అందించారు. ఈ సందర్భంగా పాణ్యంఎమ్మెల్యే మాట్లాడుతూ పీఫోర్ ద్వారా కుట్టు మిషన్ల అందజేత సమాజ సేవకు నిదర్శనమని ప్రశంసించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే బీసీ బాలుర హాస్టల్, సతీ గృహ భవనాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగిరెడ్డి, మండల టిడిపి నాయకులు గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు గౌరు వెంకట్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు

## యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి పుట్టినరోజున అభిమానులు పలు సేవా కార్యక్రమాలు

**కల్లూరు ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మంగళవారం రోజున,పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కాక,కర్నూలు జిల్లా మరియు అనంతపురంలో యువనేత .కాటసాని శివ నరసింహ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.
వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి జన్మదినం సందర్భంగా కర్నూలు నగరంలో "అక్షయ పౌండేషన్" నాగార్జున ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం మరియు రోడ్డు సైడ్ లో ఉన్న వారికి అన్నదానం చేయడం జరిగింది... అనంతరం అనంతపురంలో కాటసాని అభిమానులు అమర్నాథ్,సురేష్ రెడ్డి,రాజశేఖర్,చలపతి అనంతపురం టౌన్ నందు యువ నేత కాటసాని శివ నరసింహారెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి,యువనేత కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు యువ నేత శివ నరసింహారెడ్డి అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు




## సేంద్రియ వ్యవసాయంతోనే భవిష్య తరాలకు సారవంతమైన భూమి

**-డ్రిప్ ఇరిగేషన్‌తో తక్కువ నీటితో అధిక దిగుబడి - పాడి పరిశ్రమతో రైతులకు స్థిర ఆదాయంజిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**
భవిష్య తరాలకు సారవంతమైన భూమిని అందించాలంటే సేంద్రియ వ్యవసాయ విధానాలను విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతింటోందని, దీర్ఘకాలిక వ్యవసాయాభివృద్ధికి సేంద్రియ సాగు అత్యంత కీలకమని తెలిపారు. మంగళవారం కోసిగి మండలం చింతకుంట గ్రామంలో రైతు నారాయణ సాగు చేస్తున్న ఉల్లి, వేరుశనగ పంటలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు విధానాలు, పెట్టుబడి, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో వివరంగా చర్చించారు. ఉల్లి పంటకు ఎకరానికి సుమారు రూ.50 వేల ఖర్చుతో సగటున 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, మార్కెట్‌లో అనుకూల ధర లభిస్తే ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం సాధ్యమవుతుందని రైతు వివరించారు. వేరుశనగ పంటకు ఎకరానికి



రూ.30 వేల ఖర్చుతో 78 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, పంట అవశేషాలను పశువుల మేతకు వినియోగిస్తున్నామని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పంటల నాణ్యత పెరిగి, మార్కెట్‌లో మెరుగైన ధరలు లభిస్తాయని కలెక్టర్ చెప్పారు. సూక్ష్మ సాగునీటి విధానాల్లో భాగమైన డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని, నీటి పొదుపుతో పాటు దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలు రైతులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులకు స్థిరమైన అదనపు ఆదాయం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. పశుపోషణ, పాల ఉత్పత్తి, పశువుల ఆరోగ్య సంరక్షణ, మేత నిర్వహణ అంశాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సేంద్రియ సాగు, సూక్ష్మ సాగునీటి పద్ధతులు, పాడి పరిశ్రమ సమన్వయంతో అమలైతే రైతుల ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణుగోపాల్ శర్మ, ఎంపీడీవో మెహబూబ్ భాష్, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# అసత్య పుకార్లకు శాశ్వత విరామం కావాలి

**దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదు!వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నా రాజకీయ భవిష్యత్తు ఎదుగుదల,**
**ఎమ్మిగనూరు ప్రజల ప్రేమను ఓర్వలేకే దుష్ప్రచారాలు. - శ్రీమతి బుట్టా రేణుక**




**ఎమ్మిగనూరు, డిసెంబర్, 23,(రిపబ్లిక్ న్యూస్):**
వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్తగా నాపై "పార్టీ మారుతున్నారు", "బీజేపీ–జనసేనలో చేరుతున్నారు" అనే అసత్య పుకార్లు, తప్పుడు ప్రచారాలు కావాలని పునరావృతంగా ప్రచారం చేయబడుతున్నాయి.
ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మా పార్టీ పట్ల, నా పట్ల రోజు రోజుకీ పెరుగుతున్న ప్రజల విశ్వాసం, కార్యకర్తల అండ, నాయకుల ప్రేమను చూసి ఓర్వలేక, కొంతమంది స్వార్థ రాజకీయ శక్తులు, రాజకీయంగా దిగజారిన వ్యక్తులు ఈ నీచమైన దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారు. ప్రజలు ఈ కుట్రలను స్పష్టంగా గమనిస్తున్నారని గుర్తుంచుకోవాలి.
నేను పూర్తిగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న నాయకురాలిని. సామాజిక న్యాయం, సంక్షేమ పాలన, బలహీన వర్గాల సాధికారత అనే పార్టీ మూల సిద్ధాంతాలే నా రాజకీయ జీవనానికి దారిదీపాలు.బి
ఈ సిద్ధాంతాలను జీవితాంతం అనుసరిస్తూ ముందుకు సాగడమే నా స్పష్టమైన సంకల్పం. మా పార్టీ సిద్ధాంతాలే నా సిద్ధాంతాలు, మా అధినేత ఆలోచనలే నా రాజకీయ దారిదీపం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, నిర్మాణకర్త, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాపై పెట్టుకున్న అపార విశ్వాసమే నా రాజకీయ జీవితానికి బలం.
అదే విశ్వాసంతోనే గతంలో పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా నియమించి, రాష్ట్రవ్యాప్తంగా అనేక కీలక కార్యక్రమాల్లో బాధ్యతలు అప్పగించారు.బి
అలాగే ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేసే అవకాశం ఇచ్చి, నా పనితీరు, నిబద్ధతపై సంతృప్తి చెంది ప్రస్తుతం కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించారు. ఇది నాకు దక్కిన గౌరవం మాత్రమే కాదు పార్టీ నాపై ఉంచిన నమ్మకానికి, నా అంకితభావానికి స్పష్టమైన నిదర్శనం.బి
ఇంతటి గౌరవాలు, బాధ్యతలు లభిస్తున్న తరుణంలో నేను పార్టీ మారుతానన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, అర్థహీనమైన కుట్ర మాత్రమే ఇది ప్రజలను తప్పుదోవ పట్టించాలనే రాజకీయ లాభం కోసం చేసే చౌకబారు ప్రయత్నం.బి
ఈరోజూ అదే జరుగుతోంది ప్రజల అక్కసు ఓర్వలేకే ఈ పుకార్లు పుట్టిస్తున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న మా పార్టీ కార్యాలయం యథావిధిగా ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు నిరంతరం అందుబాటులో ఉంది.
అదేవిధంగా కర్నూలులో కూడా పార్టీ కార్యాలయం ఉంది అక్కడ అందుబాటులో ప్రజలతో మరింత దగ్గరగా ఉంటున్నాము. ఇవన్నీ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న సహజమైన, పారదర్శక చర్యలే ఎలాంటి రాజకీయ మార్పులకు సూచన కాదు.
ఈ సందర్భంగా అసత్య పుకార్లు పుట్టించి, కావాలనే దుష్ప్రచారాలు చేస్తున్న వారికి ఒకటే సూటిగా హెచ్చరిస్తున్నాను రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలి.
వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో అపోహలు కలిగించే ప్రయత్నాలు కొనసాగిస్తే, వాటిని సహించేది లేదు. మీరు దీన్ని వార్నింగ్‌గా, అభ్యర్థనగా లేదా వాస్తవాల హెచ్చరికగా తీసుకోండి %–% మీ ఇష్టం. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు.
ఎవరు నిజాయితీగా ఉన్నారో, ఎవరు కుట్రలు చేస్తున్నారో వారికి స్పష్టంగా తెలుసు. ప్రజలే మీ అసత్యాలను గుర్తించి తగిన విధంగా స్పందిస్తారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం, మా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు మేము ఎల్లప్పుడూ అండగా, అందుబాటులో ఉంటాం. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ ఆదేశాలకు లోబడి, పార్టీ బలోపేతమే మా ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతాం అన్నారు.

# మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు కొనసాగించాలి





**అనంతపురం నార్పల, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** జాతీయ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరును కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ ,ఏఐసీసీ సభ్యులు కేటీ శ్రీధర్ , వినయ్ కుమార్ ,మధుసూదన్ రెడ్డి , శాలి దాదా గాంధీ , రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్ట్ కొరివి వినయ్ కుమార్ ఎస్సీ సెల్ ఏఐసీసీ సెక్రటరీ నాయకులు పేర్కొన్నారు. మంగళవార అనంతపురం జిల్లాలోని బండ్లపల్లి గ్రామంలో అనంతపురం డిసిసి అధ్యక్షులు మధుసూదన్ రెడ్డితో కలిసి గాంధీ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఉపాధి చట్టాన్ని రద్దు చేస్తే గ్రామాల్లో కూలీలకు పని ఉండదు. ఆ కూలీలు తక్కువ కూలికే కార్పొరేట్లకు లభిస్తారని కేంద్ర ప్రభుత్వం చేసే కుట్రలను అందరూ తిప్పి కొట్టాలని కోరారు.కేంద్రం బిక్షగా కాకుండా ఉపాధి హక్కుగా లభించే విధంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మన ఆత్మగౌరవహక్కుగా పోరాటం చేసి నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో స్థానికంగా పని కల్పించి వలసలు తగ్గించేందుకు, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జాతీయ ఉపాధి హామీ చట్టం తెచ్చారని ఆ పథకాని ఉన్న గాంధీ పేరు తీసేసి గాంధీని మరోసారి బిజెపి హత్య చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ చట్టాన్ని తీసేసి మళ్ళీ వెట్టి చాకిరి విధానాన్ని తేవాలని బిజెపి ఆలోచిస్తోందని దుయ్యబట్టారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం ప్రతి సంవత్సరం పని దినాలను తగ్గిస్తూ వస్తోందని విమర్శించారు.సొంత ఊర్లో పని హక్కు లేకుండా బిజెపి చేస్తోందని ఆరోపించారు .అదానీ అంబానీ వంటి కార్పోరేట్ల మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకు ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని గుర్తు చేశారు.

# కుమ్మరపల్లి గ్రామ సర్పంచ్ గా గుమ్మడి సంతోష్ ప్రమాణ స్వీకారానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి హాజరు





**రాయికల్ పట్టణం డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మర్పల్లి గ్రామ సర్పంచ్ గా గుమ్మడి సంతోష్ ఉప సర్పంచ్ గా కొడిమియాల శేఖర్ వార్డ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి హాజరయ్యారు ప్రమాణ స్వీకారం అనంతరం అధికారులు గ్రామ ప్రజలు నూతన పాలకవర్గం కు శాలువాతో సత్కరించారు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపాలని కోరారు ఈ సందర్భంగా సర్పంచ్ గుమ్మడి సంతోష్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పైన ఎ అవసరం ఉన్న నాకు తెలిపాలని తప్పనిసరి గ్రామ ప్రజల తరఫున నాయకులు అందరూ కలిసి సమస్యలను పరిష్కరించుకుందాము అని ఈ సందర్భంగా ఆయన అన్నారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామములో ఎ అవసరం ఉన్న అభివృద్ధి పరంగా నేను సహకరిస్తానని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# నెమళ్లకుంట దత్తత గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

## జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, డిసెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):** బండిఆత్మకూరు మండలం, నెమళ్లకుంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ దత్తత గ్రామంగా తీసుకుని అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం బండిఆత్మకూరు మండలంలో జిల్లా కలెక్టర్ దత్తత తీసుకున్న నెమళ్లకుంట గ్రామంలో పునరుద్ధరణ పనులు పూర్తిచేసుకున్న పెద్దమ్మతల్లి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో నెమళ్లకుంట గ్రామానికి పర్యటన చేసిన సమయంలో గ్రామస్థులు పెద్దమ్మతల్లి దేవాలయ పునరుద్ధరణతో పాటు ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ఏర్పాటు, అంగన్వాడీ కేంద్రం నిర్మాణం వంటి అభివృద్ధి పనులను చేపట్టాలని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అందులో భాగంగా ముందుగా పెద్దమ్మతల్లి దేవాలయ పునరుద్ధరణ పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరగా, అర్హత ప్రమాణాల ప్రకారం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పెన్షన్లు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా గ్రామంలోని నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు అవసరమైన వంట సౌకర్యాల కల్పనలో భాగంగా సుమారు 44 గ్యాస్ స్టవ్‌లు మరియు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరితగతిన గ్యాస్ కనెక్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. దత్తత గ్రామంగా తీసుకున్న నెమళ్లకుంటలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# నూతన సర్పంచిగా ప్రమాణస్వీకారం చేసిన పర్కల రామ్ రెడ్డి



**ఆందోల్ ప్రతినిధి డిసెంబర్ 23 ( రిపబ్లిక్ న్యూస్)** చౌటాకుర్ మండల్ చౌటాకుర్ గ్రామ నూతన సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన పర్కల రామ్ రెడ్డి గ్రామ ప్రజలు పార్టీలకతీతంగా తాను చేసిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు గ్రామంలో అధికారంలో లేక ముందే తాను చేసిన కార్యక్రమాలను మరువక ముందే మరి ఇంకేన్నో సేవా కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ఉద్దేశంతో పదవిని నాకు అప్పజెప్పారని అదేవిధంగా ఎన్నికల హామీలో భాగంగా గ్రామానికి సీసీ కెమెరాలు ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీల ప్రకారంగా పలు కార్యక్రమాలకు స్వీకారం చుట్టామని ఆయన అన్నారు

# పైతర గ్రామ నూతన సర్పంచిగా రవితేజ ప్రమాణ స్వీకారం





**మెదక్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)** కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన టిఆర్ఎస్ యువ నాయకులు రవితేజ ప్రమాణ స్వీకార కార్యక్రమం గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుకు నడుస్తున్న వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకొని గ్రామ అభివృద్ధి నా అంతిమ లక్ష్యంగా పని చేస్తానని ప్రజలకు ఏ ఇబ్బందులు వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉండి పరిష్కరిస్తారని నియోజకవర్గంలో అభివృద్ధిలో గ్రామాన్ని ముందంజలో ఉంచడం కోసం గ్రామ ప్రజల సహకారంతో ముందుకు సాగుతానని నాతో పాటు ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల సహకారంతో గ్రామ అభివృద్ధిని ముందు ముందు ప్రతం లో నడిపిస్తానని ఆయన అన్నారు

# ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యం

## పీపీపీ విధానంపై మరోమారు మంత్రి స్పష్టీకరణ-సిద్ధార్థలో వసతి గృహం ప్రాంభించిన సత్యకుమార్ యాదవ్





విజయవాడ,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యంగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వ అమలు చేస్తోందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాల బాలికల నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ , ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి జగన్ రూ. 5 కోట్లు కూడా ఇవ్వలేదని.. నిధులు ఇవ్వని వ్యక్తికి పీపీపీ కళాశాలల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. ఈ కళాశాల వసతి గృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారని విమర్శించారు. 80 శాతం పూర్తయిన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని మండిపడ్డారు. త్వరలో మొత్తం 5 ఫ్లోర్లను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. సిద్దార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ హాస్టల్‌కు 2017లోనే రూ.21 కోట్లు నిధులు మంజూరు చేశారని.. గత ప్రభుత్వం నిధులు నిలిపివేయటంతో నిర్మాణ పనులు నిలిచి పోయాయని ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన నిధులు మంజురు చేసి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్పిటల్‌కు కావలసిన నిధులను చంద్రబాబు, మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్మాణాలకు అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చూస్తామని చెప్పారు. క్యాన్సర్ చికిత్సకు పూర్తి సౌకర్యాలతో ప్రత్యేక ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందేలా పీపీపీ మోడల్ తెచ్చామని ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు. కాగా.. ఎంబీబీఎస్ విద్యార్థినులు, సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్స్ కోసం నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీ శా, అడిషనల్ డి. ఎమ్. ఈ వెంకటేష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



# సారా పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గా రామచంద్ర రెడ్డి ప్రమాణ స్వీకారం



**డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్ )**చౌటాకుర్ మండల్ సారా పల్లి గ్రామపంచాయతీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అయిన రామచంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ మా గ్రామంలో నాపై ఎంతో నమ్మకంతో నన్ను పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా నన్ను సర్పంచ్ అభ్యర్థిగా నన్ను నియమించినందుకు నా గ్రామ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటా అదే కాకుండా ఏ సమస్య వచ్చిన సమస్యకు ముందు నేను ఉంటానని హామీ ఇస్తూనే గ్రామాన్ని అనేక రకాలుగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తాన ని మాట ఇవ్వడమే కాదు చేయూతలో కూడా చేసి చూపిస్తానని ది నికి నా గ్రామ ప్రజలు నాతోపాటు ఎన్నికైన ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్స్ అందరి సహకారాలు ఉండాలని కోరుకుంటున్నాను

# పేదరిక నిర్మూలనపై దొంగ లెక్కలు !

డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)

భారతదేశంలో పేదరిక నిర్మూలన అన్నది కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. పేదలు ఉంటేనే రాజకీయ నాయకుల మనుగడ సాధ్యం అవుతుంది. పేల పేరుతో దుబారా చేయడం సులువవువతుంది. అనేక పథకాలను ప్రకటిచడం, డబ్బులను దుబారా చేయడం, ఓట్లను దండుకోవడం అన్న ప్రక్రియ నిరంతరంగా సాగాలి. అందుకే పేదల పేరుతో నిత్యం ఏదో ఓ కార్యక్రమం సాగుతూనే ఉంటుంది. ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు మారింది. దీంతో అన్నిపార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మాగాంధీ పేరు తొలగిండంపై ఆందోళనలకు దిగాయి. లెఫ్ట్ పార్టీలు కూడా ఇందులో పాలుపంచుకోవడం దారుణం. పేరులో ఏముందున్న జ్ఞానం లేకుండా గగ్గోలు పెడుతున్నారు. ఉపాధిహామీతో అసలు కూలీలకు కరువు వచ్చింది. ప్రభుత్వ ధనం వృధా అవుతోంది. వ్యవసాయ పనులు జరగడం లేదన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఈ పథకం కింద గ్రామస్థాయిలో నిర్మాణాత్మక పనులేవీ ఇప్పటి వరకు జరగలేదు. కేవలం మట్టి ఎత్తిపోయడం తప్ప. దీనికోసం వేలకోట్లు తగలేశారు. ఇకపోతే కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశామని, కోట్ల మందికి ఇళ్లు కట్టించామని కేంద్రం చెబుతోంది. ఇంత జరిగితే పేదరికం లేకుండా పోవాలి. అలాంటప్పుడు ఉచిత బియ్యం, ఉచిత ఇల్లు, ఉచిత కరెంట్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అసవరం లేదు. ఓ వపు పేదరిక నిర్మాలన జరిగిందని చెబుతూనే..మరోవైపు పేదల పేరుతో పథకాల దందా సాగుతోంది. ఇది పాలకుల ద్వంద్వ విధానాలకు నిదర్శనం. పేదలు ఉంటేనే ఓట్లు రాలుతాయని వారికి తెలుసు. భారత్‌లో పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022-23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్టే లెక్కించింది. పేదరిక స్థాయి నిర్దారించేటప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతోబాటు వైద్యానికి, దుస్తులు వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే



మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. పెరుగుతున్న విద్య, వైద్యపు ఖర్చులతో కోట్లాదిమంది అదనంగా పేదరికంలోకి అనునిత్యమూ దిగజారిపోతూ వుంటే, కనీస పౌష్టికాహార లోపం వారిని జీవచ్ఛవాలుగా చేస్తూ వుంటే, మరోపక్క ప్రపంచబ్యాంక్ తన తప్పుడు లెక్కలతో నిరుపేదలు తగ్గిపోయారంటూ ప్రకటిస్తూ వారిని అవహేళన చేస్తూనే వుంది. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చివూరుకుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే అది ప్రభుత్వం నిర్ణయించినదానికి మూడు రెట్లయినా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు. నజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరల దాడి వల్ల ఉన్నవారు కూడా పేదలుగా మారే ప్రమాదం ఏర్పడింది. దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. ప్రపంచ బ్యాంక్ లెక్కలు ఎందుకు పనికిరానివిగా గుర్తించాలి. పేదరిక నిర్మూలన అంటే కూడు,గూడు, గుడ్డ ఉంటేనే చాలదు. బతకడానికి పని ఉండాలి. పనిచేసుకుంటే కుటుంబాన్ని పోషించుకోగలగాలి. ఇవేవీ లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులను కల్పించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కూడా లేవు. పేదరికం నుంచి బైట పడడానికి నిర్దిష్టమైన చర్యలను తీసుకోవడం మొదలుపెట్టాలి. దుర్భర దారిద్యంలో బతుకుతున్నవారిని గుర్తించి వారికి తగు విధంగా పునరావాసానికి సహాయం అందించడంలో ముందుకు సాగాలి. కుటుంబాలను గుర్తించేందుకు గ్రామాల వారీగా లెక్కలు తీయాలిచ ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్దారించింది. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడు డాలరు-రూపాయి మారకపు విలువ ప్రకారం పేదరికపు స్థాయి రూ.270గా ఉండాలి. కాని వాస్తవ మారకపు రేటు ప్రకారం కాకుండా అందులో 0.28 శాతం రేటు ప్రకారం మాత్రమే లెక్కిస్తోంది! ఇక్కడి అధికారిక పేదరిక స్థాయికి దగ్గరగా ఉండేట్టు వాస్తవ మారకపు రేటును సవరిస్తోంది! ఇలా వివిధ దేశాల్లో అధికారిక లెక్కల్లో పేదరికపు స్థాయిని హీనమైన స్థాయికి దిగజార్చు తున్నారు. ఆ స్థాయిలో ప్రాణాలను నిలబెట్టుకోవడమే అసాధ్యం అన్న వాస్తవాన్ని తెలిసి కూడా లెక్కల కోసం ఇలా చేస్తున్నారని అనుకోవాల్సిందే. చాలా దశాబ్దాలుగా ప్రభుత్వాలు పేదరికపు స్థాయిని లెక్కించే విధానాన్ని అసమగ్రంగా చేపడుతున్నాయి. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకే జరుగుతోందన్నది స్పష్టం. మొట్టమొదట లెక్కించిన కనీస పేదరిక స్థాయి మాత్రమే సరైన పద్ధతిలో సాగింది. తరవాత ధరల సూచీ ఆధారంగా సవరిస్తూ వచ్చారు. అలా సవరించిన తర్వాత ఆ సొమ్ముతో పౌరుడు లేదా ఓ కుటుంబం కనీస పౌష్టికాహారం పొందగలుగుతున్నారా లేదా అన్నది మాత్రం ఎక్కడా పరిశీలించిన పాపాన పోలేదు. పేరికాన్ని లెక్కించే విషయంలో దేశంలో చదువుకున్న వారికీ ఈ ప్రభుత్వం, ప్రపంబ్యాంక్ అనుసరిస్తున్న పద్ధతి ఎంత అర్థరహితమో తెలియదు గనుకనే ప్రభుత్వపు ఆటలు సాగుతున్నాయి.ఇలా ప్రతీసారీ అధికారిక లెక్కలు పేదరిక స్థాయిని అంతకంతకూ తగ్గిస్తూనే వస్తున్నాయి. అది కాస్తా ఇప్పుడు అసందర్భమైన, అర్థం లేని స్థాయికి చేరింది. ప్రభుత్వం నిర్ణయించిన పేదరిక స్థాయి కనీసం ప్రాణాలనైనా నిలబెట్టుకోడానికి కూడా పనికిరాదు. అందుచేత మా దేశంలో నిరుపేదలే లేరు అని చెప్పుకోవడం దౌర్భాగంయం తప్ప మరోటి కాదు. నిజానికి కాలానుగుణంగా కనీస అవసరాలు మారుతూ వుంటాయి. ఆ మార్పును పరిగణనలోకి తీసుకోవాలి. కాని అలా తీసుకోకపోయినప్పటికీ, పాత స్థాయిలోనే అవసరాలు కొనసాగుతున్నాయని అనుకున్నప్పటికీ, వాటిలో వచ్చిన మార్పులనైనా పరిగణనలోకి తీసుకోవాలి. 50 సంవత్సరాల క్రితం విద్య, వైద్యం ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందుతూవుండేవి. అప్పుడు వాటి కోసం చేయవలసిన ఖర్చు నామ మాత్రంగా ఉండేది. ఇప్పుడు ఆ సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. వాటి ధరలు శరవేగంగా పెరిగిపోతూ వున్నాయి. ఇటు వైద్యానికి, చదువుకు, అటు ఆహారానికి ఖర్చు సర్దుబాటు చేయడం చాలా కుటుంబాలకు అసాధ్యం అయిపోతోంది. దీని వలన ఎక్కువమంది పేదల పౌష్టికాహార స్థాయి పడిపోతోంది. అంతేగాక, ఇంతవరకూ పేదలుగా పరిగణించబడనివారు కూడా ఇప్పుడు పేదరిక స్థాయికి దిగువకు జారిపోతున్నారు. జాతీయ శాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం ఇండియాలో గ్రామాల్లోను, పట్టణాల్లోను తలసరి పౌష్టికాహార లభ్యత చాలా వేగంగా పడిపోయింది. ఇది గమనించకుండా పేదరికం నుంచి విముక్తి పొందారని, పేదరికం తగ్గిందని లెక్కలు వేసుకోవడం ఆత్మహత్యా సదృశ్యం కాగలదు.

# గ్రీన్‌ల్యాండ్‌పై కన్నేసిన ట్రంప్

**జాతీయ భద్రత కోసమేనని కుంటిసాకులు - ప్రత్యేక దూతగా జెఫ్ లాండ్రీ నియామకంపై డెన్మార్క్ ఆగ్రహం**

వాషింగ్టన్,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**


డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌లాండ్ ను కొనుగోలు చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాజాగా లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీని గ్రీన్ ల్యాండ్‌కు ప్రత్యేక దూతగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తడంతో ట్రంప్ స్పందించారు. అమెరికాకు జాతీయ భద్రత నిమిత్తం గ్రీన్‌లాండ్ కావాలని.. ఖనిజాల కోసం కాదని అన్నారు. ఈ బాధ్యతను నిర్వర్తించడానికే ప్రత్యేక దూతగా జెఫ్ లాండ్రీని నియమించినట్లు తెలిపారు. యూఎస్‌తో పాటు మిత్ర దేశాల ప్రయోజనాల కోసం ఆయన పని చేస్తారన్నారు. గ్రీన్‌లాండ్‌కు జెఫ్ లాండ్రీని రాయబారిగా నియమించడంపై డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. అమెరికా సహా అన్ని దేశాలతో కలిసి ముందుకు సాగుతామని.. కానీ



మా భవితవ్యాన్ని మేమే నిర్ణయించుకుంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని ప్రకటించారు. అమెరికాతో సహా ప్రతిఒక్కరూ డెన్మార్క్ రాజ్య ప్రాంతీయ సమగ్రతను గౌరవించాలని డెన్మార్క్ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. డెన్మార్క్‌లో భాగంగా గ్రీన్‌లాండ్ స్వయంప్రతిపత్తి కలిగిన దీవిగా కొనసాగుతోంది. గ్రీన్‌లాండ్‌లో రాగి, లిథియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల్లో వీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో అమెరికా వాటిపై దృష్టిపెట్టింది. 2016లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ట్రంప్ గ్రీన్‌లాండ్ కొనుగోలు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హ్యారీ ట్రూమాన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఆయన ఈ ద్వీపం కొనుగోలుకు ప్రతిపాదించారు. 100 మిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని ఇచ్చేందుకు సిద్ధమైనప్పటికీ దానిని డెన్మార్క్ తిరస్కరించింది. గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదని, భవిష్యత్తులోనూ అమ్మే ప్రసక్తే లేదని ఆ దేశ ప్రధాని మ్యూట్ బొరప్ ఎగిడే ఇటీవల మరోసారి స్పష్టంచేశారు. అయినప్పటికీ అమెరికా తన తీరు మార్చుకోవట్లేదు. తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది.

## గుర్తు తెలియని వాహన ఢీకొని పులి మృతి

గుంటూరు,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**



గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దపులి మృతి చెందిన ఘటన సోమవారం అర్థరాత్రి వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. 565 జాతీయ రహదారిపై నిన్న అర్థరాత్రి రోడ్డు ప్రమాదంలో పెద్ద పులి మరణించడంతో విషయం తెలుసుకున్న అటవీ శాఖ పోలీస్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పులి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న సిరిగిరిపాడు గ్రామస్తులు పెద్దపులిని చూసేందుకు వందలాదిమందిగా వచ్చారు. దీంతో ఫారెస్ట్ అటవీ పోలీస్ అధికారులు పులి దగ్గరికి ఎవరినీ వెళ్లనీయకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు.

## కెవి చౌదరికి సెలబ్రిటీ అవార్డుతో సన్మానం

తిరుపతి,**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండిస్ట్రీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కేవీ చౌదరిని సెలబ్రిటీ అవార్డు ద్వారా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా రాజభవన్‌లో సత్కరించారు. ప్రజా డైరీ మాసపత్రిక 25 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా కె.వి చౌదరిని సెలబ్రేట్ అవార్డుతో సత్కరించామని అశోక్ గజపతిరాజు తెలిపారు. ఈ సందర్భంగా కె.వి చౌదరి మాట్లాడుతూ గోవా గవర్నర్ వద్ద ఈ అవార్డు అందుకోవడం తన చాలా ఆనందం కలిగించిందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారస్తుల కోసం చేసిన సేవ కార్యక్రమాలు గుర్తించి ప్రజా డైరీ మాసపత్రిక సెలబ్రిటీగా అవార్డు ఎంపిక చేయడం కాకుండా గోవా గవర్నర్ దగ్గర తీసుకోవడంతో తనపై మరింత బాధ్యత పెరిగింది అన్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం మరింతగా పనిచేస్తానని కె వి చౌదరి వెల్లడించారు.

# విదేశీ విద్యలో ఏపీ టాప్..

**అమెరికాను దాటేసిన కెనడా: నీతి ఆయోగ్ నివేదిక**

**విదేశాలకు విద్యార్థులను పంపడంలో ఆంధ్రప్రదేశ్ టాప్**

**అమెరికాను వెనక్కి నెట్టి భారత విద్యార్థులకు కెనడా మొదటి ఎంపిక**

**పెరిగిపోతున్న బ్రెయిన్ డ్రెయిన్‌పై నీతి ఆయోగ్ ఆందోళన**

**భారత్‌లో విదేశీ వర్సిటీల ఏర్పాటుకు కేంద్రం ప్రోత్సాహం**

**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్తున్న భారత విద్యార్థుల విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. అదే సమయంలో, భారత విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడే దేశంగా అమెరికాను అధిగమించి కెనడా మొదటి స్థానానికి చేరింది. ఈ కీలక విషయాలను నీతి ఆయోగ్ "భారత్‌లో ఉన్నత విద్య అంతర్జాతీయీకరణ" పేరుతో విడుదల చేసిన నివేదిక వెల్లడించింది.




నివేదిక ప్రకారం, 2016 నుంచి 2020 వరకు విదేశాలకు విద్యార్థులను పంపడంలో ఆంధ్రప్రదేశ్ వరుసగా మొదటి స్థానంలో ఉంది. 2018లో ఏపీ నుంచి రికార్డు స్థాయిలో 62,771 మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లారు. ఏపీ తర్వాత మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి.

గత కొన్నేళ్లుగా భారత విద్యార్థుల ప్రాధాన్యతల్లోనూ స్పష్టమైన మార్పు కనిపించింది. 2016లో అమెరికాలో 4.23 లక్షల మంది భారత విద్యార్థులు ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 3.37 లక్షలకు తగ్గింది. ఇదే సమయంలో కెనడాలో భారత విద్యార్థుల సంఖ్య 94,240 నుంచి ఏకంగా 4.27 లక్షలకు పెరిగింది. ఇది దాదాపు 350 శాతం పెరుగుదల. అటు యునైటెడ్ కింగ్‌డమ్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య కూడా భారీగా పెరిగింది.

అయితే, ఈ వలసల వల్ల దేశంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశీ విద్య కోసం భారతీయులు చేస్తున్న ఖర్చు 2013%-%14లో దాదాపు రూ. 29,000 కోట్లు ఉండగా ఇది 2025 నాటికి 70 బిలియన్ డాలర్లకు (దేశ జీడీపీలో 2 శాతం) చేరుకోవచ్చని అంచనా. ముఖ్యంగా ఇంజినీరింగ్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ వంటి %ూజువీ% రంగాల్లోని ప్రతిభావంతులు దేశం విడిచి వెళ్లడం వల్ల పరిశోధన, అభివృద్ధి (%=ఙ%) రంగాలు బలహీనపడుతున్నాయని నివేదిక హెచ్చరించింది.

ఈ "బ్రెయిన్ డ్రెయిన్"ను అరికట్టేందుకు జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా "ఇంటర్నేషనలైజేషన్ ఎట్ హోమ్" కార్యక్రమానికి కేంద్రం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా, ప్రపంచ స్థాయి విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు అనుమతించడం, అలాగే ఐఐటీల వంటి భారత విద్యాసంస్థలు విదేశాల్లో క్యాంపస్‌లు తెరిచేలా ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

## గర్భిణిపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్



శ్రీసత్యసాయి, **డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)** శ్రీసత్యసాయి జిల్లా ముత్యాలవాండ్లపల్లిలో గర్భిణిపై దాడి చేసిన వైకాపా కార్యకర్త అజయ్‌దేవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని కదిరి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నడిపించుకుంటూ పీఎస్‌కు తీసుకెళ్లారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ముత్యాలవాండ్ల పల్లిలో వైకాపా పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. గ్రామంలో కేకు కోసి, బాణసంచా కాలుస్తూ అరుపులు, కేకలతో హంగామా చేశారు. గ్రామానికి చెందిన ఏడునెలల గర్భిణి సంధ్యారాణి ఇంటివద్ద పదేపదే బాణసంచా కాల్చడంతో.. శబ్దాలతో ఇబ్బందిగా ఉందని, పక్కకు వెళ్లి కాల్చుకోండని ఆమె చెప్పారు. దీంతో వైకాపా నాయకులు కోపంతో ఊగిపోయారు. ఆ పార్టీ కార్యకర్త అజయ్‌దేవ్ ఆమెపై దాడిచేశాడు. గర్భిణి అన్న కనికరం కూడా లేకుండా ఆమె జుట్టు పట్టుకుని లాగి, కడుపుపై కాలితో తన్ని గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. మంగళవారం అజయ్‌దేవ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు.

# కర్నూల్ఎంపీ బస్తిపాటి నాగరాజు నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
మంగళవారం రోజున క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ ,కరుణ , త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ఎంపీ నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.వేడుకలలో భాగంగా ఎంపీ నాగరాజు కేక్ కట్ చేసి జిల్లాలోని క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు.. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# పెండింగ్ ఉన్న ఫార్మ్స్ ను వేగవంతంగా పరిష్కరిస్తున్నాం

**అస్పష్టమైన చిత్రాలు, ఫోటో మిస్మ్యాచ్ లాంటి వాటిని జనవరి 10 లోపు పూర్తి చేస్తాం**

**జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**



**నంద్యాల బ్యూరో, డిసెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):** పెండింగ్ ఉన్న ఫార్మ్స్ ను వేగవంతంగా పరిష్కరించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బిఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ఎ.ప్రదీప్, సిపిఐ పార్టీ ప్రతినిధి పి.నరసింహులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి ఎ. నరేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ పెండింగ్ ఉన్న ఫార్మ్స్ 6, 7, 8 లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో అస్పష్టమైన ఫోటోలు, ఒకరి ఫోటోకు బదులు మరొకరి ఫోటోలు, మనుషులు లేని ఫోటోలను జనవరి 10వ తేదీ లోపు సవరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడం జరిగిందని, సదరు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని, ఎలక్ట్రోల్ ఓటర్ మ్యాపింగ్ ను కూడా పూర్తి చేస్తున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ వివరించారు. అదేవిధంగా "బుక్ ఏ కాల్ బిఎల్ఓ" కార్యక్రమం ద్వారా ఓటర్లకు ఎటువంటి సమస్య ఉన్న పబ్లిక్ గ్రీవెన్స్ పోర్టల్ లో నమోదు చేసినట్లయితే నేరుగా బిఎల్ఓలు సదరు నంబర్కు ఫోన్ చేసి వారి సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు.రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికలలో ఈవీఎం మిషిన్లకు బదులుగా బ్యాలెట్ పేపర్లను ఏర్పాటు చేయాలని, బిఎల్ఓలు ఫీల్డ్ విజిట్ క్షుణ్ణంగా జరిపేలా చూడాలని రాజకీయ పార్టీ ప్రతినిధులు డిఆర్ఓకు నివేదించారు.

# జిల్లాను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలి

**పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, డిసెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 24 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో చాలెంజ్ బేస్ డేస్టినేషన్ కింద అహోబిలంలో రూ.25 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.పర్యాటక ప్రాంతాలు, వాటి యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెలవు దినాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈఓ కు సూచించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల ఆనందంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చునన్నారు.
అహోబిలం, శ్రీశైలం, మహానంది, బెలూన్ కేవ్స్ లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలనిఅక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే సిసి కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచి యాత్రికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి తీసుకున్న చర్యలు, ఇంకను చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా టూరిజం అధికారి, డీఈవో జనార్ధన్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీసీ బాలుర వసతి గృహ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తీవ్ర ఆగ్రహం

**వార్డెన్, వాచ్మెన్‌పై కఠిన చర్యలు : అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారికి షోకాజ్ నోటీసు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ డిసెంబర్ 23)**
వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోసిగి మండల కేంద్రంలో ఉన్న సమీకృత బాలుర వసతి గృహం నిర్వహణలో తీవ్ర లోపాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.మంగళవారం కలెక్టర్ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, చికెన్ తక్కువగా ఇస్తున్నారని, అరటిపండ్లు ఇవ్వడం లేదని, ఆదివారం టిఫిన్ ఆలస్యంగా పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. అలాగే బాత్రూమ్‌లు అశుభ్రంగా ఉండటం, లైట్‌లు, ఫ్యాన్‌లు పనిచేయకపోవడం, డార్మిటరీ తలుపులు, కిటికీలు శిథిలావస్థలో ఉండటం, వాచ్మెన్ దురుసుగా ప్రవర్తించడం వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.డార్మిటరీలు, టాయిలెట్లు పరిశీలించిన కలెక్టర్ పరిస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే మరమ్మత్తులు చేపట్టి వారం రోజుల్లో పూర్తి చేసి ఫోటోలు పంపించాలని బీసీ సంక్షేమ అధికారిని ఆదేశించారు.వంటగదిని పరిశీలించిన సందర్భంగా మెనూ ప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదని, పాలలో నీళ్లు కలిపి ఇస్తున్నారా?, చికెన్ తక్కువగా పెట్టడం ఏమిటని వంట సిబ్బందిని కలెక్టర్ తీవ్రంగా మందలించారు. సంబంధిత వంట సిబ్బందిని వెంటనే మార్చాలని ఆదేశించారు.నిర్లక్ష్యానికి బాధ్యులైన వార్డెన్ గోపాల్‌ను రీప్లేస్ చేసి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించిన వాచ్మెన్ రామయ్యను తొలగించాలని, పర్యవేక్షణలో విఫలమైన అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.వసతి గృహం వెనుక డ్రైనేజ్ నీరు నిల్వ ఉండటంపై స్పందించిన కలెక్టర్ వెంటనే శుభ్రం చేయించాలని డీపీఓను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి అలసత్వం సహించబోమని, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం పట్ల అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీపీఓ భాస్కర్, కోసిగి తహసిల్దార్ వేణుగోపాల్ స్వామి, ఎంపిడిఓ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.





# జీవన ప్రమాణాలు మెరుగు పరచాలి

**: జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా -దత్తత గ్రామంలో చెంచులకు గ్యాస్ స్టవ్ ల పంపిణీ**

**గిరిజనులతో కలిసి పెద్దమ్మ దేవాలయం ప్రారంభించిన కలెక్టర్**







**బండిఆత్మకూరు, డిసెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్ ):-** గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా అధికారులను ఆదేశించారు. మండలంలోని నెమళ్ళ కుంట గిరిజన గూడెంనీ గతంలో పిపిపి విధానంలో దత్తత తీసుకున్న నేపథ్యంలో ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఇటీవల చెంచులు నిర్మించుకున్న నూతన పెద్దమ్మ దేవాలయాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం 44 చెంచు గూడల్లో 9 వేల మంది గిరిజనులు జీవిస్తున్నారన్నారు. వీరందరికి జీవనోపాది కల్పించుటకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా పేపర్ ప్లేట్ల తయారీ, జ్యూట్ బ్యాగ్ ల తయారీ, అగర్ వత్తుల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పించనున్నామని తెలిపారు. అలాగే వారిని సారా, చెడు వ్యాసనాల బారి నుండి దూరం చేసి, వారికి ఆర్. ఓ ప్లాంట్ ల ద్వారా మంచి నీటి సరఫరా చేసి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఉజ్వల పథకం కింద గూడెం లోని 40 కుటుంబాలకు గ్యాస్ స్టవ్ లను అందజేశారు.అనంతరం ఆమె మీడియా తో మాట్లాడుతూ గిరిజనులకు వారికి మౌలిక వసతులు కల్పించి, వారి అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ రవి బాబు, తహసీల్దార్ పద్మావతమ్మ, ఎంపిడిఓ గాయత్రి, పంచాయితీ రాజ్ ఈఈ నాగరాజు, డిఈ ఆయాజ్ బాష, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రమాదేవి,ఎఈ వెంకటరాముడు, డాక్టర్ దినేష్ బాబు, వెటర్నరీ డాక్టర్ అనూష, సి ఎస్ డి టి శ్రీనివాసులు, భారత్ గ్యాస్ నిర్వాహకుడు రాజారెడ్డి. మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ల వేతనాలకు రూ.50.04 కోట్లు విడుదల

**చంద్రబాబు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే జీవో**

**8427 మంది పాస్టర్లకు లబ్ది**

**మైనారిటీల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు**

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**నంద్యాల బ్యూరో, డిసెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్)**
:రాష్ట్రం లో క్రైస్తవుల భద్రతకు, గౌరవానికి ఎలాంటి భంగం కలగనివ్వమని... క్రైస్తవుల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది... 24 వ తేదీ లోపు పాస్టర్లకు గౌరవ వేతనం అందజేస్తాం...సిఎం చంద్రబాబు.
విజయవాడలోని ఏ-ప్లస్ కన్వెన్షన్ లో రాష్ట్ర ప్రభుత్వం - మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తేనేటి విందు( హై టీ ) సెమీ క్రిస్మస్ వేడుకలు సందర్భంగా సోమవారం రాత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన బిషప్ లు, పాస్టర్లు, దైవ ప్రసంగీకులు, క్రైస్తవ మత పెద్దల హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రిస్మస్ కు ముందే గౌరవ వేతనం అందజేస్తామని ప్రకటించిన విషయం విధితమే.ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే పాస్టర్ల గౌరవ వేతనాలు చెల్లింపుకు రూ.50.04 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం జరిగింది.మంగళవారం ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2024 డిసెంబరు నుండి 2025 నవంబరు నెల వరకు, ఒక్కొక్కరికి రూ. 5000 చొప్పున 12 నెలల గౌరవ వేతనం 8427 మంది పాస్టర్లకు చెల్లించేందుకు నిధులు విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఒకేసారి ఒక్కొక్క పాస్టర్ కు రూ. 60 వేలు క్రిస్మస్ పర్వదినం కు ముందే వారి అకౌంట్లకు జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, 24 గంటల్లోపే పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపు కోసం జీవో విడుదల చేయడం తో మైనారిటీల పక్షపాతి చంద్రబాబు అని మరో మారు స్పష్టమైందని పేర్కొన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి వరకు మైనారిటీల సంక్షేమానికి చంద్రబాబు ఒక విజన్ తో చేస్తున్న కృషి రాష్ట్రంలోని మైనారిటీ లు మరువలేరని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో మైనారిటీ ల సంక్షేమాన్ని పూర్తిగా అణగదొక్కే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఇచ్చిన హామీని కేవలం 24 గంటల లోపే నెరవేర్చడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో గొర్రెలు, మేకలలో ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమం



**మల్లాపూర్ డిసెంబర్ 24 (రిపబ్లిక్ న్యూస్)**మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో పశువైద్య %ం% పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో గొర్రెలు, మేకలలో ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని ముత్యంపేట గ్రామ సర్పంచ్ తేలు నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్యంపేట్ పశువైద్యుడు డాక్టర్ అశోక్ మాట్లాడుతూ బాహ్య పరన్నా జీవులు పిడుదులు, గోమార్లు, పేలు, ఇవి జీవాల చర్మాన్ని కుడుతూ, రక్తాన్ని పీలుస్తూ, జీవాలకు రక్త హీనత కలిగి జీవాలు నీరసించి పోతాయి. వీటివలన జీవాలకు వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి అనేక రోగాలకు కారణమవుతాయి.అంతర పరాన్న జీవుల విషయానికి వస్తే, పొట్ట జలగలు, కార్జపు జలగలు, రక్తపు జలగలు అనేవి ముఖ్యమైనవి. అంతర పరాన్న జీవులు జీవాల శరీరంలోని ముఖ్య భాగాలలో, అవయవాలలో నివసిస్తాయి. అందువలన జీవాలలో ఎదుగుదల కుంటుపడుతుంది. తరచుగా ఏదో ఒక వ్యాధికి గురి అవుతూ ఉంటాయి.రోగాలను తట్టుకునే శక్తి తగ్గిపోతుంది.మేత సరిగా మేయలేవుజీవాలు బరువు కోల్పోతాయి. కాబట్టి మాంసం దిగుబడి తగ్గిపోయి పెంపకం దారులకు ఆర్థికంగా రావలసినంత ఆదాయం రాదు కాబట్టి ప్రతి మూడు నెలల పైబడిన గొర్రెలు మేకలకు నట్టల మందులు వేయించాలనిరైతులకు అవగాహన కల్పించడం జరిగింది .ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్, సహాయక సిబ్బంది ఇక్బాల్, రవీందర్, సాయన్న, పంచాయితీ కార్యదర్శి అబ్దుల్ మోబిన్, ముత్యంపేట గ్రామ ఉపసర్పంచ్ వంగ పోతయ్య, కారోబార్ శ్రీనివాస్, రోడా శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

## రాయికల్ చేర్ల కొండాపూర్ చెరువు కట్టపై కంప చెట్లను తొలగిస్తున్న సర్పంచ్ దేవుని రవి



**రాయికల్ పట్టణం డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలము చేర్ల కొండాపూర్ మధ్యలో గల చెరువు కట్టపై చెట్లు పెరగడంతో కంప చెట్లను గ్రామ సర్పంచ్ దేవుని రవి గ్రామపంచాయతీ పాలకవర్గం కలిపి ట్రాక్టర్ తో రోడ్డును మంచిగా చేసారు ముఖ్యంగా చెరుకట్టపై చెట్ల మధ్యలో నడిచే స్థితిలా లేనందున మొట్టమొదటిగా చెరుకట్టపై ట్రక్టర్ తో మరమత్తు చేస్తున్నాం అని సర్పంచ్ దేవుని రవి బాధనావేని రాజిరెడ్డి తెలిపారు మును ముందు చెరువు కట్టపై సిమెంట్ రోడ్డు కొరకై స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ వేయించాలని అనుకుంటున్నాం అని రవి తెలిపారు

## నేను కూడా రైతునే

### బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు కురుమల్లారెడ్డి!!




**రాయికల్ పట్టణం డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)**
నేను కూడా రైతునే అంటున్నజగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ బిజెపి అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి ఈరోజ రాయికల్లో రైతు దినోత్సవ వేడుకల్లో నేను రైతునేనని రైతు లేనిదే రాజ్యం లేదు జై జవాన్ జై కిసాన్ అన్న లాల్ బహదూర్ శాస్త్రి మాటలలో ఆకర్షితున్ని అయి భారతీయ జనతా పార్టీలో కార్యకర్త స్థాయి నుండి పట్టణ శాఖ అధ్యక్షునిగా కొనసాగుతున్నానని తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ మోసం చేస్తుందని ఇంతవరకు మొక్కజొన్న డబ్బులు అమ్మిన డబ్బులు ఇంతవరకు అందలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు పథకాలు ప్రవేశపెట్టి ముందు అవి తెలుసుకొని పై అధికారులతో చర్చించి ఆ పథకాన్ని ప్రవేశపెట్టాలని అలాగే ముందుకు నడిపించాలని రైతు నాయకునిగా చెప్తున్నాను అని మల్ల రెడ్డి అన్నారు

## రాయికల్ అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ హాజరైన దీక్ష స్వాములు

-భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు -సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ చిన్నమనేని నివేదిత కృష్ణారావు













**రాయికల్ పట్టణం డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రము లొ శబరిమల మందిరాన్ని తలపించేలా నిర్మించిన అయ్యప్ప ఆలయం 23 ఏళ్లుగా దీక్షపరుల నీరాజనాలు అందుకుంటుంది ఇటిక్యాలకు చెందిన చిన్నమనేని కృష్ణారావు- నివేదిత దంపతులు 2002 లో ఆలయాన్ని నిర్మించగా ఏట రెండు నెలల పాటు అయ్యప్ప మాలదారులకు దీక్ష సమయంలో భిక్ష అల్పాహారం ఉచితంగా అందిస్తున్నారు, 2017లో కృష్ణారావు మృతి చెందగా ఆ లోటు తెలియకుండా సేవలను సాయప్ప ట్రస్టు ద్వారా నిర్వహణ కొనసాగిస్తున్నారు 2023 లో ఆలయానికి మరమ్మత్తులు నిర్వహించి గతేడాది ఫిబ్రవరిలో పున ప్రతిష్ట చేశారు

గణపతి హెూమం, 1000 మంది మాతలచే కుంకుమ పూజ, కలశ పూజలు మరియు 500 మంది అయ్యప్ప స్వాములచే లక్ష్య పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు వైదిక అర్చకులు మునుగోటి సత్యనారాయణ శర్మ సాయి సుధీర్ శర్మ వారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు, సాయంత్రం ఏడు గంటల నుండి శబరిమల అర్చకులు ఉన్ని కృష్ణన్ నంబూద్రి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు,6000 మంది భక్తులకు మరియు స్వాములకు భిక్ష అల్పాహారం ఏర్పాటు చేశారు భజన సంకీర్తనలతో మార్మోగింది చుట్టుపక్కల గల జగిత్యాల్ కోరుట్ల మెట్పల్లి కనపురం జన్నారం మంచిర్యాల్ ధర్మపురి పలు ప్రాంతాల నుండిఅధిక సంఖ్యలో భక్తులు స్వాములు హాజరయ్యారు

## రాయికల్ లో జాతీయ రైతు దినోత్సవ వేడుకలు

### లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 40 మంది రైతులను సత్కరించారు

-సేంద్రియ ఎరువులపై కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఏది...!
-పప్పు దినుసులు, నూనె గింజలకు క్వింటాల్ కు వేయి బోనస్ అందించాలి
-సేంద్రియ ఎరువుల తయారీ పై ఎకర 4వేల రాయితీ కల్పించాలి
-మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**రాయికల్ పట్టణం డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)**
రసాయన ఎరువులు,మందు బస్తాల వినియోగం తగ్గించాలని కొరత పెట్టి కేంద్ర ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు రాయితీ అందించి ఎందుకు ప్రోత్సహించడం లేదని మాజీమంత్రి జీవన్ రెడ్డి అన్నారుజాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీ రైతు గోనె రెడ్డి సంఘం 40 మంది రైతులను శాలువా, మెమొంటో అందించి ఘనంగా సన్మానించారుఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతన్న దేశానికి వెన్నెముక లాంటివారని పలు రకాల పరిశ్రమలకు ముడి సరుకులను అందిస్తున్నారన్నారు వస్త్ర పరిశ్రమ మొదలుకొని మందుల పరిశ్రమల వరకు రైతుల భాగస్వామ్యాన్ని వర్ణించలేమన్నారు ఎండ,వాన,చలి అని తేడా లేకుండా కష్టపడుతున్న కర్షకులను గుర్తించి ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదుకోవాలని అన్నారు.నాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును అందించి రైతులను ఆదుకున్నారని పేర్కొన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పప్పు దినుసులు,నూనె గింజలు పండించిన రైతులకు క్వింటాలకు 200 బోనస్ అందించిన మాదిరిగా పెరిగిన ధరలకు అనుగుణంగా నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పప్పు దినుసులు, నూనె గింజలు పండించిన రైతులకు క్వింటాలకు రూ.1000 బోనస్ అందించాలన్నారు. నేడు రైతుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కోతుల బెడదని ఆరుతడి పప్పు దినుసుల పంటను ప్రోత్సహించాలంటే పంటకు నష్టాన్ని కలిగించే కోతుల పునరుత్పత్తి ఆపే ప్రయత్నం చేపడితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రసాయన ఎరువుల తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీకి ఎకరాకు రూ.4 వేలు రాయితీని రైతులకు అందించి ప్రోత్సహించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు ఆన్లైన్ బుకింగ్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్,శివాజీ రైతు గోనె రెడ్డి సంఘం అధ్యక్షులు కుంబాల శ్రీనివాసరెడ్డి,ప్రధాన కార్యదర్శి జిల్లెల మల్లారెడ్డి,కోశాధికారి కడపటి రాజేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు జిల్లెల రాజిరెడ్డి,జిల్లెల గంగారెడ్డి,దమ్మ గంగారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి,సభ్యులు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య,మచ్చ శేఖర్, కొయ్యడి మహిపాల్, దాసరి గంగాధర్, కొమ్ముల ఆది రెడ్డి, బొమ్మకంటి నవీన్,కుర్మ సుదర్శన్,జిల్లెల సూర్యం, రైతు నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.





## నూతన పాలక వర్గానికి సన్మానం

**మల్లాపూర్ డిసెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)**
ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా పదవి స్వీకరణ చేసిన రేగుంట గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, ఉపసర్పంచ్ గనవేని నందిని మల్లేశ్ మరియు వార్డు సభ్యులకు సన్మానం చేసిన గీత కార్మిక సంఘం సభ్యులు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు రంగు రామాగౌడ్, పెద్ద మనుషులు సుధగోని శ్రీనివాస్, కొక్కెరకుంట మల్లేశ్, మూడంపల్లి గంగరాజం, %ఎం% సలీం, మరియు ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజేంగి నందయ్యను సన్మానించిన రాయికల్ కాంగ్రెస్ నాయకులు



**రాయికల్ పట్టణం డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)**
నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య సర్పంచుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాయికల్ కు మొదటి సరి రాగ మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,మాజీ సర్పంచ్ తంగేళ్ల రమేష్, హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి,బాపురపు నరసయ్య, బత్తిని భూమయ్య, షాకీర్,మోబిన్, రాకేష్, మంద రమేష్, రాజారెడ్డి,ఏలేటిరాజేందర్ రెడ్డి నరేష్,అశోక్, గోపాల్, రవీందర్,నాగరాజు,సాయి,శివ,రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.




## అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యదిశాఖధికారి రాము సందర్శన

**రాయికల్ పట్టణం డిసెంబర్ 23( రిపబ్లిక్ న్యూస్)**
జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ లో నిర్వహించిన గణిత మేళాను జిల్లా విద్యాశాఖాధికారి రాము సందర్శించి విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ జీవితం గణితమయం అని, వేగం మరియు ఖచ్చితత్వం గణిత లక్షణాలు అని అన్నారు విద్యార్థులు గణితంలో రాణించడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాస్, కన్నవేణి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనుబంధ ఆలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి

## భారీగా ఏర్పాట్లు చేసిన టిటిడి బోర్డు



తిరుపతి,డిసెంబర్23: డిసెంబరు 30వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టిటిడి అనుబంధ ఆలయాలలో భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, రంగవల్లులు తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించనున్నారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున 1.35 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించనున్నారు. ఉదయం 8.30 గంటలకు స్వామివారు గరుడవాహనంపై విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. సాయంత్రం 4.30 నుండి 6 గంటల వరకు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయి. నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామివారి ఆలయంలో డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 1.35 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం, ఉదయం 8.30 గంటలకు లక్ష తులసీ అర్చన నిర్వహించనున్నారు. డిసెంబరు 31న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 1.35 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.డిసెంబరు 31న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 8.30 నుండి 11.30 గంటల వరకు చక్రస్నాం నిర్వహించనున్నారు.

జమ్మలమడుగు శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 1.35 గంటలకు భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించనున్నారు.

అదేవిధంగా అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామివారి ఆలయం, రాజంపేటలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, పిఠాపురంలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం, కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయం, బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, అమరావతిలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు

## ఏపీ వ్యాప్తంగా ఒకే తరహా బ్యాంక్ గ్యారెంటీలు -అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు



అమరావతి,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): వివిధ జిల్లాల్లో నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచనలు ఇచ్చారు. ఏపీ వ్యాప్తంగా ఒకే తరహా బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. ధాన్యం కొనుగోళ్లతో సహా వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు సీఎం చంద్రబాబు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానం మేరకు తక్షణమే చర్యలు ఉండాలని నిర్దేశిరచారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోళ్లు చేసే మిల్లర్లు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు.. ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు ఉండాలని దిశానిర్దేశర చేశారు. పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. 7,8,9 తరగతులు చదివే విద్యార్థులకు క్వాంటంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 జనవరి చివరిలో స్టూడెంట్స్ పార్టనర్ షిప్ సమ్మిట్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆ సమ్మిట్‌లో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేద్దామని సీఎం చంద్రబాబు సూచించారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

## మద్యం తాగా డ్రైవింగ్ చేస్తే పదివేల జరిమానా -అధికారులతో సమీక్షించిన కమిషనర్ సజ్జన్నార్



హైదరాబాద్,డిసెంబర్23::నూతన సంవత్సరం సందర్భంగా భాగ్యనగరంలో పలు ఆంక్షలు విధిస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, న్యూ ఇయర్
బందోబస్తుపై టీజీఐసీసీసీలో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ సజ్జనార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలోని హాట్ స్పాట్లు, నేరప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం నుంచి నగరవ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తనిఖీల కోసం 7 ఎ÷-లాటూన్ల అదనపు పోలీస్ బలగాలు మోహరిస్తున్నట్లు వివరించారు సీపీ సజ్జనార్. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా, 6 నెలల జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. ర్యాష్ డ్రైవింగ్, వీలింగ్, రేసింగ్‌లపై జీరో టాలరెన్స్ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలకు వెళ్లేవారు డెసిగ్నేటెడ్ డ్రైవర్ లేదా క్యాబ్ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. పబ్‌లు, హోటళ్లలో వేడుకలకు డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు సీపీ సజ్జనార్. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు యాజమాన్యాలదే బాధ్యత అని చెప్పుకొచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళల భద్రతకు 15 షీ టీమ్స్ మఫ్టీలో నిఘా ఉంటాయని వివరించారు. 2026 వేడుకలు తీపి జ్ఞాపకాలుగా మిగలాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# కాంగ్రెస్‌ది పక్కా మాఫియా పాలన

## చెక్‌డ్యామ్‌లను కూల్చేస్తున్న ఇసుక మాఫియా

## ప్రభుత్వ కనుసన్నల్లోనే ఈ వ్యవహారం

## మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



హైదరాబాద్,డిసెంబర్23:: తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. పక్కా మాఫియా పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ ఇది మానవ నిర్మిత విధ్వంసం అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. డ్రిల్లింగ్ మెషీన్లతో హోల్స్ చేసి, జెలటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారని అన్నారు.ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజా ధనంతో కట్టిన చెక్ డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా అని నిలదీశారు. భూగర్భ జలాలు పెరగాలని మేం చెక్ డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారని మండిపడ్డారు. మీ ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతాంగం బలి కావాలా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ రిపోర్ట్ చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్న ఆస్తులను కూల్చడంలో మీరు సిద్ధహస్తులని విమర్శించారు. తెలంగాణ ఆస్తులపై బాంబులు వేస్తున్న మాఫియా వెనుక ఉన్న అసలు దొంగలను బయటపెట్టండని డిమాండ్ చేశారు. రాజేంద్ర సింగ్ డిమాండ్ చేసినట్లు పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బాంబుల సెగ మీ కుర్చీ దాకా రావడం ఖాయమని హెచ్చరించారు.

# అతి వేగంగా గోడను ఢీకొన్న బైక్

## ముగ్గురు యువకులు దుర్మరణం

ఏలూరు,డిసెంబర్23:: అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను తీసింది. బైక్ అదుపుతప్పి గోడను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని పోలమూరు గ్రామంలో జరిగింది. ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో పోలమూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు అర్ధరాత్రి 12 గంటల 30 నిముషాల సమయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళుతుండగా బైక్ అతి వేగంతో వెళ్లి అదుపుతప్పింది. రోడ్డు ఖాళీగా ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి షాప్ గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలంలోనే ఇద్దరు యువకులు మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో యువకుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులు కొల్లు సత్యనారాయణ (28), యేలేటి అంజిబాబు (25), యేలేటి రాజు (19) గా గుర్తించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అతి వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. యువతకు శక్తివంతమైన బైకులు ఇచ్చేముందు తల్లిదండ్రులు మరింత జాగ్రత్తలు తీసుకొని సరైన పర్యవేక్షణ కల్పించాలని హితవు పలికారు.

-----------------

# కర్నాటకలో పరువు హత్య

## కూతరును చంపిన తండ్రి

బెంగళూరు,డిసెంబర్23: కర్ణాటక హుబ్బళ్లిలో విషాద సంఘటన చోటు చేసుకుంది. తమ పరువు తీసిందన్న కోపంతో కూతురు గర్భవతి అని చూడకుండా ఆమెపై దాడి చేయడంతో చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ దారుణ ఘటన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. వీరాపుర గ్రామానికి చెందిన మాన్య పాటిల్ (19), వివేకానంద ఇద్దరూ డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రేమించుకున్నారు. వివేకానంద అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు. దాంతో తండ్రి గౌడ పాటిల్ వారి పెళ్లికి నిరాకరించాడు. అంతేకాదు ఆ సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమిస్తే మన పరువు పోతుందని.. అందరూ చావాల్సిందే అని బెదిరించాడు. కానీ, మాన్య మాత్రం తన ప్రియుడిని జూన్ 19న ఒక ఆలయంలో పెళ్లి చేసుకుంది. అనంతరం ఇద్దరూ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే మాన్య తల్లిదండ్రులను స్టేషన్ కి పిలిచి రాజీ కుదిర్చారు పోలీసులు. కొత్త జంట హవేరీ జిల్లాలో కాపురం పెట్టారు. ఏడు నెలల నుంచి ఎలాంటి గొడవలు లేకపోవడంతో తన తల్లిదండ్రులు అంతా మర్చిపోయారని భావించింది మాన్య. ప్రస్తుతం మాన్య ఆరు నెలల గర్భవతి. హాస్పిటల్‌లో చూపించుకునేందుకు దంపతులు తిరిగి గ్రామానికి వచ్చారు. తన పరువు తీసి అత్తామామ వద్ద ఉన్న విషయం తెలుసుకున్న మాన్య తండ్రి కోపంతో రగిలిపోయాడు.తన బంధువులు వీరన గౌడ మహదేవ గౌడ పాటిల్, అరుణ్ గౌడ పాటిల్‌తో వెళ్లి మాన్య అత్తమామ, భర్తపై పైపులు, రాడ్లతో దాడి చేశారు. వాళ్లను కొట్టవొద్దని అడ్డువచ్చిన మాన్యపై కూడా దారుణంగా దాడి చేయడంతో తీవ్ర గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ కన్నుమూసింది. భర్త, అత్తమామలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం నిందితులు అరెస్ట్ చేశారు.

---------------



# మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి

హైదరాబాద్,డిసెంబర్23:భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని సిఎం అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

## హెచ్1బీ వీసాలపై ట్రంప్ సర్కార్ సంచలన నిర్ణయం...

# లాటరీ విధానానికి స్వస్తి

**డిసెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**

అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయులకు కీలకమైన హెచ్1బీ వీసా ఎంపిక ప్రక్రియలో ట్రంప్ ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న లాటరీ విధానానికి స్వస్తి పలుకుతూ, అధిక నైపుణ్యాలు, ఎక్కువ జీతాలు పొందే వారికి ప్రాధాన్యత ఇచ్చే కొత్త వెయిటెడ్ విధానాన్ని మంగళవారం ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయం అమెరికన్ కార్మికుల వేతనాలు, ఉద్యోగ అవకాశాలను కాపాడటానికేనని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ స్పష్టం చేసింది.ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని అమెరికాలోని కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్లతో పోలిస్తే తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి దీన్ని ఒక మార్గంగా వాడుకుంటున్నాయని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అధికార ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ ఆరోపించారు. "కొత్త విధానం హెచ్1బీ కార్యక్రమం యొక్క అసలు ఉద్దేశ్యాన్ని నెరవేరుస్తుంది. ఎక్కువ జీతాలు, అధిక నైపుణ్యాలు ఉన్న విదేశీ ఉద్యోగుల కోసం దరఖాస్తు చేసేలా కంపెనీలను ప్రోత్సహిస్తుంది. ఇది అమెరికా పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది" అని ఆయన వివరించారు.




**కొత్త విధానం ఎలా పనిచేస్తుందంటే...!**

ఈ కొత్త విధానం ప్రకారం, ఇకపై హెచ్1బీవీసా దరఖాస్తులను యాదృచ్ఛికంగా ఎంపిక చేయరు. బదులుగా, వాటిని జీతం, నైపుణ్యాల స్థాయి ఆధారంగా ర్యాంకులుగా విభజించి, అధిక ర్యాంకులు ఉన్నవాటికే వీసాలు దక్కేలా చూస్తారు. అయితే, తక్కువ జీతాలతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పూర్తిగా తొలగించడం లేదని, కేవలం అధిక నైపుణ్యాలున్న వారికి ప్రాధాన్యం పెరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఏటా జారీ చేసే వీసాల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు. సాధారణ కోటాలో 65,000 వీసాలు, అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించిన వారికి అదనంగా 20,000 వీసాలు యథావిధిగా కొనసాగుతాయి.ఈ కొత్త నిబంధన ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి రానుండగా, 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్ల నుంచి దీన్ని వర్తింపజేయనున్నారు. హెచ్1బీ వీసా వ్యవస్థను సమూలంగా సంస్కరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాల్లో ఈ మార్పు ఒక కీలక ముందడుగు. ఇటీవల వీసాకు అర్హత పొందాలంటే యజమానులు అదనంగా 1,00,000 డాలర్లు చెల్లించాలనే నిబంధనను కూడా తీసుకురావడం గమనార్హం.

సాంకేతిక రంగంలో హెచ్1బీ వీసాలకు అధిక డిమాండ్ ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాల నుంచి వేలాది మంది నిపుణులు ఈ వీసాలపై ఆధారపడి అమెరికాలో పనిచేస్తున్నారు. పాత లాటరీ విధానం వల్ల ప్రతిభకు సరైన గుర్తింపు లభించడం లేదని, కొందరు తక్కువ నైపుణ్యాలున్న దరఖాస్తులతో సిస్టమ్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఎప్పటినుంచో విమర్శలున్నాయి. ఈ మార్పుల ద్వారా హెచ్1బీకార్యక్రమంపై విశ్వసనీయతను పునరుద్ధరించవచ్చని సంస్కరణల మద్దతుదారులు భావిస్తుండగా, వ్యాపార వర్గాలు మాత్రం కఠినమైన నిబంధనల వల్ల అమెరికా ఆవిష్కరణలు, పోటీతత్వానికి నష్టం వాటిల్లవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# రెండో టీ20లో టీమిండియా ఘన విజయం

## శ్రీ చరణి, వైష్ణవి స్పిన్ మ్యాజిక్...

### లంక స్వల్ప స్కోరుకే పరిమితం




విశాఖ వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టీ20లో భారత మహిళలు అదరగొట్టారు. 129 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో శ్రీలంకతపై 7 వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో లంకపై భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది.

షెఫాలీ వర్మ(69) అద్భుత ప్రదర్శనతో హాఫ్ సెంచరీ చేసి అజేయంగా నిలిచింది. రిచా ఘోష్(1), హర్మన్ ప్రీత్ సింగ్() స్మృతి మంధాన(14), జెమీమా రోడ్రిగ్స్(26) పర్వాలేదనిపించారు. శ్రీలంక బౌలర్లలో మాల్కి మదర, కవింది, కవిశా దిల్హరి తలో వికెట్ పడగొట్టారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన శ్రీలంక బ్యాటర్లు ఆది నుంచే తడబడుతూనే వచ్చారు. తొలి టీ20 మాదిరిగానే.. ఈ మ్యాచులోనే స్వల్ప స్కోరుకే పరిమితమయ్యారు. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేశారు. టీమిండియాకు 129 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు.

విష్మి గుణరత్నే(1), హాసిని పెరెరా(22), కవిశా దిల్హారి(14), నిలాక్షి డిసెల్వా(2), కౌశని నుత్యాంగణ(11), షాషని గింహాని(0), కాయా కవింది(1) స్వల్ప పరుగులకే పెవిలియన్ చేరారు. చిమరి ఆటపట్టు(31), హర్షిత సమరవిక్రమ(33) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో అరంగేట్ర మ్యాచులోనే వైష్ణవి శర్మ అదరగొట్టింది. వైష్ణవి శర్మ, శ్రీ చరణి తలో రెండు, క్రాంతి గౌడ్, అరుంధతీ రెడ్డి చెరొక వికెట్ పడగొట్టారు. గత మ్యాచులాగే ఇందులోనూ మూడు రనౌట్లు ఉండటం గమనార్హం.






శ్రీలంక మహిళల జట్టుతో జరుగుతున్న రెండో టీ20లో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శన చేశారు. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత స్పిన్నర్లు ఎన్. శ్రీ చరణి (2/23), వైష్ణవి శర్మ (2/32) రాణించడంతో శ్రీలంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు మాత్రమే చేయగలిగింది.టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే పేసర్ క్రాంతి గౌడ్ (1/21) శుభారంభం అందించింది. ఓపెనర్ విష్మి గుణరత్నె (1)ను తొలి ఓవర్‌లోనే ఔట్ చేసింది. కెప్టెన్ చమరి అటపట్టు (24 బంతుల్లో 31) రెండు సిక్సర్లతో దూకుడుగా ఆడినప్పటికీ, ఆమెను స్నేహ్ రాణా (1/11) పెవిలియన్‌కు పంపింది. జ్వరంతో దీప్తి శర్మ ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో ఆమె స్థానంలో జట్టులోకి వచ్చిన స్నేహ్ రాణా కీలక వికెట్ పడగొట్టింది.ఆ తర్వాత హర్షిత సమరవిక్రమ (33), పెరీరా (22) కలిసి మూడో వికెట్‌కు 44 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, ఈ జోడీని శ్రీ చరణి విడదీయడంతో లంక పతనం మొదలైంది. ఆ తర్వాత వైష్ణవి శర్మ కూడా వికెట్లు తీయడంతో లంక స్కోరు వేగం మందగించింది. నీలాక్షి డిసిల్వా (2)ను ఔట్ చేసిన వైష్ణవి, తన తొలి టీ20 వికెట్‌ను ఖాతాలో వేసుకుంది.

చివరి ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో శ్రీలంక బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో ఆ జట్టు 128 పరుగులకే పరిమితమైంది.

## చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ..




మంగళవారం విడుదలైన ఐసీసీ మహిళల టీ20ఐ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ నంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా, బ్యాట్స్‌మెన్ వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది.దీప్తి శర్మ తొలిసారిగా టీ20ఐ అంతర్జాతీయ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన టీ20ఐ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 4 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి 1 వికెట్ తీసిన దీప్తి, ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సదర్లాండ్‌ను అధిగమించి టాప్ బౌలర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా, దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన స్వదేశీ వన్డే సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లలో సెంచరీలు చేసిన వోల్వార్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా లభించింది.ఈ ప్రదర్శనతో, వోల్వార్ట్ తన కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్‌ను సాధించింది. స్మృతి మంధానను అధిగమించి నంబర్ 1 స్థానాన్ని ఆక్రమించింది. నిజానికి, లారా వోల్వార్ట్ ఇంతకు ముందు కూడా ఈ స్థానాన్ని ఆక్రమించింది.అంతేకాకుండా, శ్రీలంకపై అజేయ అర్ధ సెంచరీ సాధించిన జెమిమా రోడ్రిగ్స్, టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి టాప్ 10కి చేరుకుంది, తొమ్మిదవ స్థానానికి చేరుకుంది. ఆమెతో పాటు స్మృతి మంధాన మూడవ స్థానంలో, షఫాలి వర్మ పదవ స్థానంలో ఉన్నారు. అదే సమయంలో, బౌలింగ్‌లో, అరుంధతి రెడ్డి కూడా ఐదు స్థానాలు ఎగబాకి 36వ స్థానానికి చేరుకుంది.

........

## ఫిబ్రవరి 13 నుంచి టాలీవుడ్ ప్రో లీగ్..






తెలుగు సినీ, క్రీడాభిమానులకు ఇదో డబుల్ బొనాంజా న్యూస్. ఒకేసారి ఇటు సినీ అభిమానులను అటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించే టీపీఎల్ టాలీవుడ్ ప్రొ లీగ్‌కు సర్వం సిద్ధమైంది. ప్రముఖులు పాల్గొనే ఈ టోర్నీ ఫిబ్రవరి 13 నుంచి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం ఈ లీగ్ ట్రోఫీని, జెర్సీని సినీ, క్రికెట్ ప్రముఖులు ఆవిష్కరించారు. దిగ్గజ క్రికెటర్లు కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, సురేశ్ రైనాలతో పాటు సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు సోనూ సూద్, సంగీత దర్శకుడు తమన్, నటి రాశీ ఖన్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, దిల్ రాజు, సోనూ సూద్ కలిసి స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడారు.టాలీవుడ్.. క్రికెట్ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు కపిల్‌దేవ్. హైదరాబాద్ అందమైన నగరమే కాదు, రుచికరమైన వంటకాలకు కేంద్రమని కొనియాడారు. సినీ నటులు, టెక్నీషియన్లు కలిసి క్రికెట్ లీగ్ ఆడటం మంచి పరిణామమన్నారు వీరేంద్ర సెహ్వాగ్. తెర మీద కనిపించే నటులతో పాటు తెర వెనుక ఉండి పని చేసేవారితో కలిసి టీపీఎల్ టోర్నీ జరుగుతుందన్నారు దిల్‌రాజు. ఆరు జట్లతో కూడిన ఈ ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌లో ప్రముఖ నిర్మాతలు జట్లకు యజమానులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

............

# విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ, రోహిత్..




ప్రతిష్ఠాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీకి రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి ఈ టోర్నీకి తెరలేవనుంది. 15 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఈ టోర్నీ బరిలోకి దిగుతున్నారు. న్యూఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ, ముంబై తరఫున రోహిత్ ఆడనున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరు ఆటగాళ్లు ఆయా జట్లతో కలిసి సన్నాహకాలు మొదలుపెట్టారు. ఈ ఇద్దరూ తమ జట్ల తరఫున తొలి రెండు మ్యాచ్‌లు ఆడనున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు రిషభ్ పంత్ (ఢిల్లీ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్ (పంజాబ్), మహమ్మద్ షమీ (బెంగాల్), హార్దిక్ పాండ్యా (బరోడా) వంటి స్టార్ ఆటగాళ్లు కూడా తమ రాష్ట్ర జట్ల తరఫున బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ తెచ్చిన కొత్త నిబంధన కారణంగా భారత ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. దాంతో ఈ టోర్నీకి క్రేజ్ నెలకొంది. డిసెంబర్ 24 నుంచి జనవరి 18 వరకు ఈ టోర్నీ జరగనుంది. జనవరి 12 నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరగనుండగా.. జనవరి 18న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తం 38 జట్లు బరిలోకి దిగుతున్నాయి.బెంగళూరు వేదికగా ఆంధ్ర జట్టుతో ఢిల్లీ తొలి మ్యాచ్ ఆడనుంది. ఆంధ్ర జట్టుకు ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే ఈ మ్యాచ్‌కు ప్రేక్షకుల అనుమతి లేదు. ఐపీఎల్ 2025 సీజన్ విజయానంతరం చిన్నస్వామి స్టేడియం బయట జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కనీసం 2000 నుంచి 3000 మంది అభిమానులను అయినా లోపలికి అనుమతించాలని కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతా కారణాల రీత్యా అనుమతి నిరాకరించారు. ఈ మ్యాచ్ వేదికను కూడా చిన్నస్వామి నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు తరలించారు.విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్‌తో పాటు జియో హాట్ స్టార్ వేదికగా ప్రసారం కానున్నాయి. లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లకు ప్రత్యక్ష ప్రసారం లేదు. కేవలం అహ్మదాబాద్, రాజ్‌కోట్ వేదికగా జరిగే మ్యాచ్‌లు మాత్రమే ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. దాంతో కోహ్లీ, రోహిత్ మ్యాచ్‌లను చూసే అవకాశం అభిమానులకు లేకుండా పోయింది. 38 జట్లు ఉండటం.. ఒకే రోజు 19 మ్యాచ్‌లు ఒకే సమయంలో ప్రారంభం కానుండటంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నాకౌట్ మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.




## టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించిన ఇండోనేషియా బౌలర్

**అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇండోనేషియాకు చెందిన ఫాస్ట్ బౌలర్ గెడె ప్రియాందన ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు పడగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కాని ఈ అద్భుత ఫీట్‌ను సాధించిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కాడు. బాలి వేదికగా కంబోడియాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మంగళవారం ఈ సంచలనం చోటుచేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోనేషియా, ధర్మ కేసుమా అజేయ శతకం (110) సాయంతో 167 పరుగులు చేసింది. అనంతరం 168 పరుగుల లక్ష్య ఛేదనలో కంబోడియా 15 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్లకు 106 పరుగులతో ఫర్వాలేదనిపించింది. కానీ, 16వ ఓవర్ బౌలింగ్‌కు వచ్చిన ప్రియాందన మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ప్రియాందన తన ఓవర్‌లోని తొలి మూడు బంతులకు 3 వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. నాలుగో బంతి డాట్ కాగా, చివరి రెండు బంతులకు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. చివరి రెండు బంతుల మధ్య ఒక వైడ్ ఉండడంతో ఈ ఓవర్లో ఒక అదనపు పరుగు మాత్రమే వచ్చింది. దీంతో కంబోడియా 107 పరుగులకే ఆలౌట్ కాగా, ఇండోనేషియా 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంతకుముందు టీ20ల్లో లసిత్ మలింగ, రషీద్ ఖాన్, జేసన్ హెూల్డర్ వంటి దిగ్గజాలు ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ప్రియాందన అసాధారణ ప్రదర్శన ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.**

# చీరలోనే అందం..

## హీరోయిన్ల డ్రెస్సింగ్ సెన్స్‌పై శివాజీ వ్యాఖ్యలు వైరల్!

'దండోరా' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో శివాజీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. ముఖ్యంగా హీరోయిన్ల వేషధారణ, డ్రెస్సింగ్ సెన్స్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఈ కార్యక్రమంలో మాట్లాడిన శివాజీ, ముందుగా యాంకర్ డ్రెస్సింగ్ సెన్స్‌ను ప్రశంసించిన అనంతరం, హీరోయిన్ల వేషధారణపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

హీరోయిన్ల అందం చీరలోనే, నిండుగా కప్పుకొనే బట్టల్లోనే ఉంటుందని శివాజీ వ్యాఖ్యానించారు. బహిరంగంగా అతిగా కనిపించే దుస్తులు వేసుకుంటే గౌరవం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. "అందం అంటే గౌరవంతో పాటు ఉండాలి. గ్లామర్ ఓ స్థాయి వరకు బాగుంటుంది. దాన్ని దాటి పోతే విమర్శలు తప్పవు" అంటూ చెప్పుకొచ్చారు. అలాగే స్త్రీ స్వేచ్ఛను ప్రస్తావిస్తూ, స్వేచ్ఛ అనేది అదృష్టమని, దాన్ని మనమే కోల్పోకూడదని అన్నారు.పాత తరం నటి సావిత్రి, సౌందర్య వంటి వారు గౌరవప్రదమైన వేషధారణతోనే చిరస్థాయిగా గుర్తుండిపోయారని, ఈ తరంలోనూ రష్మిక వంటి నటీమణులు తమదైన ఇంపాక్ట్ క్రియేట్ చేశారని శివాజీ వ్యాఖ్యానించారు. ప్రపంచ వేదికలపై కూడా సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన మహిళలకే గుర్తింపు లభించిందని ఆయన అన్నారు.

అయితే, శివాజీ ఉపయోగించిన కొన్ని పదాలపై నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అభిప్రాయం చెప్పడం సరికాదని కాదు కానీ, మాటల ఎంపిక మర్యాదగా ఉండాల్సిందని విమర్శిస్తున్నారు. మరోవైపు ఆయన మాటలకు మద్దతు తెలుపుతున్నవారూ ఉన్నారు.

ఇక శివాజీ, బిందు మాధవి, నవదీప్ ప్రధాన పాత్రల్లో నటించిన 'దండోరా' చిత్రం క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న విడుదల



కానుంది. సామాజిక అసమానతలు, కుల వ్యవస్థ వంటి సున్నిత అంశాలను స్పృశిస్తూ తెరకెక్కిన ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. మురళీ కాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని 'కలర్ ఫోటో', 'బెదురులంక 2012' వంటి సినిమాలు నిర్మించిన లౌక్య ఎంటర్టైన్మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ నిర్మించారు.

## విజువల్ వండర్‌గా 'వృషభ'..



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ప్రతిష్టాత్మక మూవీ 'వృషభ'. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తోంది. 'వృషభ' చిత్రాన్ని కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. విమల్ లహోటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న 'వృషభ' సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో సమర్జిత్ లంకేష్ మాట్లాడుతూ "వృషభ' బిగ్గెస్ట్ యాక్షన్ ఫిలిం. అలాగే లవ్, ఫాదర్, సన్ మధ్య ఎమోషన్ కూడా చాలా ఉంటుంది" అని అన్నారు.



## సిఐడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి

నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ అందిన పారితోషికం మరియు కమీషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా
విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

## సొంత సినిమా కోసం చీరకట్టులో సమంత స్టంట్స్!



ప్రముఖ నటి సమంత తన తదుపరి చిత్రం 'మా ఇంటి బంగారం' కోసం సరికొత్త సాహసానికి సిద్ధమయ్యారు. తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రా లాలా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంలో, ఆమె యాక్షన్ సన్నివేశాల్లో స్వయంగా నటిస్తున్నారు. విశేషమేమిటంటే, డూప్ సహాయం లేకుండా, చీరకట్టులోనే ఆమె ఈ స్టంట్స్ చేస్తున్నారు. ఇది ఆమె కెరీర్‌లోనే అత్యంత శారీరక శ్రమతో కూడిన పాత్రలలో ఒకటిగా నిలవనుంది.'ది ఫ్యామిలీ మ్యాన్', 'సిటాడెల్' వంటి వెబ్ సిరీస్‌లతో యాక్షన్ హీరోయిన్‌గా నిరూపించుకున్న సమంత, ఇప్పుడు అంతకు మించిన పాత్రలో కనిపించనున్నారు. "ఈ చిత్రంలో సమంత తనను తాను మరింతగా నిరూపించుకోవాలని భావించారు. అందుకే చీరలో యాక్షన్ సన్నివేశాలు చేస్తున్నారు. ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది" అని చిత్ర బృందానికి చెందిన ఒకరు తెలిపారు. సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే చీరకట్టులో సమంత చేసే యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని భావిస్తున్నారు. చిత్ర నిర్మాతలలో ఒకరైన హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ, "భావోద్వేగాలు, విలువల పునాదిపై భారీ యాక్షన్ చిత్రంగా 'మా ఇంటి బంగారం'ను రూపొందిస్తున్నాం. సమంత సొంతంగా ఫైట్స్ చేయడం సినిమాకు మరింత ప్రామాణికతను తెచ్చిపెట్టింది. ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని వివరించారు. ఈ సినిమాకు అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ లీ విటేకర్ స్టంట్స్ కంపోజ్ చేస్తుండగా, సంతోష్ నారాయణన్ సంగీతం, ఓం ప్రకాశ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు ఈ చిత్రానికి సమంతతో కలిసి నిర్మాణ భాగస్వాములుగా ఉన్నారు. ఇటీవల సమంత, రాజ్ నిడిమోరు వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే.



## కెరీర్ చరమాంకంలో ఇస్మార్ట్ బ్యూటీ!

చిత్రంతో తెలుగు పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు ఇస్మార్ట్ శంకర్ సినిమాతో వెలుగులోకి వచ్చింది. పూరి మేకింగ్ లో అమ్మడు ప్రత్యకంగా హైలైట్ అయింది. నటిగా నభాకు ఓ ఐడెంటిటీ దక్కింది. కానీ ఏం లాభం ఆ సక్సస్ ని మాత్రం కొనసాగించ లేకపోయింది. ఆ తర్వాత నటించిన డిస్కోరాజా%- ,-% సోలో బ్రతుకే సో బెటర్%-, -%అల్లుడు అదుర్స్%-, -%మ్యాస్ట్రోలాంటి చిత్రాలు డిజాస్టర్లు అయ్యాయి. దీంతో నభా టాలీవుడ్ లో ఏకంగా మూడేళ్ల పాటు కనిపించడం మానేసింది. శక్తివంతమైన పాత్రలో: మళ్లీ 2024 లో డార్లింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ అయింది. ఇలా ఇన్నిఫ్లాప్ లు చూసిన బ్యూటీకి తెలుగులో మరో అవకాశం అంటే జరిగే పని కాదని అంతా డిసైడ్ అయ్యారు. కానీ అప్పుడే ఓ పాన్ ఇండియా సినిమాలో ఛాన్స్ అందుకుని సర్ ప్రైజ్ చేసింది. నిఖిల్ హీరోగా స్వయంభూ చిత్రం తెర కెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఓ హీరోయిన్ గా నభా నటేష్ ని దర్శకుడు భరత్ కృష్ణమాచారి ఛాన్స్ ఇచ్చాడు. ఇందులో అమ్మడు ఓ శక్తివంతమైన పాత్రలో నే కనిపించనుంది. హీరోకు ధీటుగా ఆ రోల్ ఉంటుందని ప్రచారం జరుగుతోంది.గుర్రపు స్వారీలు..యుద్ద సన్నివేశాల్లో నభా నటేష్ కనిపించనుంది. ఆ సన్నివేశాల కోసం ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా తీసుకుంది. కెరీర్ చరమాంకంలో నభా నటేష్ కి వచ్చిన ఓ గొప్ప అవకాశంగానే ఈ చిత్రాన్ని చెప్పాలి. ఇలాంటి సినిమాల్లో భాగమవ్వాలని ఎంతో మంది నటీమణులు ఆశపడుతుంటారు. డ్రీమ్ రొల్స్ అన్నవి ఇలాంటి కథలకే ఆస్కారం ఉంటుంది. కాబట్టి యువరాణి పాత్రలన్నవి ఇలాంటి సినిమాలతోనే సాధ్యమవుతుంటాయి. అలాంటి పాత్రలో నభానటేష్ ఛాన్స్ అందుకోవడంతో అదృష్టవంతురాలేనే చెప్పాలి. ఒండు భాషలకే పరిమితమైన నటి: అదెలా ఉన్నా? సినిమా సక్సస్ మాత్రమే నభా నటేష్ కెరీర్ డిసైడ్ చేసేది. ఇప్పటికే చాలా ఛాన్సులొచ్చాయి. కానీ ఇదే చివరి ఛాన్స్. అదీ ఏడాది గ్యాప్ తర్వాత రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఈ సినిమా విజయం సాధిస్తే నభా నటిగా మళ్లీ బిజీ అవుతుంది. కొత్త అవకాశాలకు అవకాశం ఉంటుంది. ఇతర భాషలకు కూడా ప్రమోట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. పాన్ ఇండియాలో ఓ గుర్తింపు దక్కుతుంది. నభా నటేష్ కేవలం తెలుగు, కన్నడ చిత్రాలు తప్ప మరే భాషల్లోనూ పని చేయలేదు. స్వయంభూ సక్సెస్ తో అన్ని భాషల్లోనూ బిజీ అవ్వాలని ఆశీద్దాం.

## ఎఐతో పెళ్లి వీడియో

### అభిమానులను ఆట పట్టించిన జగపతిబాబు



టాలీవుడ్‌లో శోభన్ బాబు తర్వాత అంతటి ఫ్యామిలీ హీరో ఇమేజ్ సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. వరుస సూపర్ హిట్ చిత్రాలతో మహిళా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఆయన, సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఊహించని స్థాయిలో సత్తా చాటుతున్నారు. అలాంటి సీనియర్ హీరో తాజాగా తన ఇంట్లో ఒక పెద్ద శుభకార్యం జరిగిందంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తన రెండో కూతురి పెళ్లి జరిగిపోయిందంటూ జగపతి బాబు షేర్ చేసిన వీడియో నెట్టింట వేగంగా వైరల్ అయింది. సాధారణంగా సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే భారీ ఏర్పాట్లు, ఆర్భాటం ఉంటాయి. కానీ జగపతి బాబు మాత్రం చాలా సింపుల్‌గా మా రెండో అమ్మాయి పెళ్లయి పోయిందోచ్ అంటూ వీడియోను షేర్ చేయడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. నిజంగానే పెళ్లి జరిగిందా? లేక సరదాగా చేసిన పోస్టా? అన్న సందేహాలు నెటిజన్లలో మొదలయ్యాయి. ఈ సస్పెన్స్‌కు క్లారిటీ వచ్చింది. జగపతి బాబు షేర్ చేసిన వీడియో అసలు నిజమైన పెళ్లి వీడియో కాదు. అది పూర్తిగా ఏఐ టెక్నాలజీతో రూపొందించిన క్రియేటివ్ కంటెంట్ అని తేలింది. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందో చూపించడమే కాకుండా, తన అభిమానులను సరదాగా ఆటపట్టించాలన్న ఉద్దేశంతోనే ఈ వీడియోను షేర్ చేసినట్లు తెలుస్తోంది. జగపతి బాబు ఇప్పటికే తన పెద్ద కూతురు పెళ్లిని చాలా నిరాడంబరంగా, విదేశీయుడితో జరిపించిన విషయం తెలిసిందే. అలాగే తన పిల్లల విషయంలో ఆయన ఎంతో స్వేచ్ఛనిచ్చే తండ్రిగా కూడా పేరుంది. గతంలో ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో తన రెండో కుమార్తెకు పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి లేదని, అది పూర్తిగా ఆమె వ్యక్తిగత నిర్ణయమని ఆయన స్పష్టంగా చెప్పారు. 'నా పిల్లలు ఏం చేయాలనుకుంటారో అది వారి ఇష్టం. పెళ్లి అనేది వారి ఛాయిస్. నేను ఎప్పుడూ ఒత్తిడి చేయను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో ప్రశంసలు అందుకున్నాయి.మొత్తానికి పెళ్లి కబురు అనుకుని సంబరపడ్డ అభిమానులకు ఇది ఒక స్వీట్ షాక్‌గా మారింది.